

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 24.0


మా దారి..గోదారి!

ఏమి హాయిలే ఇలా...

36..40..42..45..ఎంత ఉష్ణోగ్రత వచ్చినా మాకేం భయంలేదు.. భానుడు ఎంత ప్రతాపం చూపితే మాకు అంత ఆనందం అంటున్నారు గోదావరి పరీవాహక ప్రాంతం జనం.. వేసవి ఆరంభం నుంచి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒక్కటే సందడి..గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూడా అలాగే ఉంది. జనంతో నిండిపోయింది. భానుడు ఉష్ణోగ్రత పెంచుతుంటే జనం కూడా అదే స్థాయిలో గోదారమ్మ చెంతకు చేరి ఇలా సేదతీరుతున్నారు..కుటుంబంతో కలిసి గోదావరిలో స్నానాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు.. గోదారమ్మ ఒడిలో పెద్దలైనా చిన్న పిల్లల్లా మారిపోతున్నారు. నీటిలో మునుగుతూ తేలుతూ ఒళ్లంత..తుళ్లింత కావాలిలే అంటూ ఆటలాడుతున్నారు. మహిళలు కూడా తరలివచ్చి స్నానాలు చేస్తున్నారు.. అయితే ఆనందంలో ఆదమరుపుగా ఉండొద్దు.. ఎటు నుంచి ఎటువంటి ప్రమాదం వస్తుందో చెప్పలేం.. తస్మాత్ జాగ్రత్త.. ఇరిగేషన్ అధికారులు సందర్శకులపై దృష్టి సారించాల్సి ఉంది.. గోదావరి ప్రమాదాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాల్సి ఉంది. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



ఆటవిడుపు
ఉప్పొంగిలే గోదావరి : గోదావరిలో సేదతీరుతున్న జనం



గురుకులాలు.. గాలికే!

కోట్లు ఊడ్చేసి.. కాంట్రాక్టు కంపెనీ కక్కుర్తి పనులు

సమస్యల మధ్యే చదువు సా..గుతోంది.. అయినా అటువైపు కన్నెత్తి చూసేవారే లేరు.. కనీసం పట్టించుకునేవారు కానరావడంలేదు.. నిధులు ఏమైనా లేవా అంటే అదీ కాదు.. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారిపోయింది.. కోట్లు తీసుకున్నా.. కక్కుర్తి పనులు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.. ఇదీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 21 అంబేడ్కర్ గురుకుల వసతి గృహల్లో దుస్థితి.. కలుషిత నీళ్లు తాగుతూ.. అపరిశుభ్ర వాతావరణం మధ్య వేలాది మంది విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాంట్రాక్టు శానిటేషన్ కంపెనీ నిధులు మింగేసి నిర్వహణ గాలికొదిలేయడంతో సమస్యల మధ్యే చదువు సాగిస్తున్నారు. ప్రిన్సిపాళ్లు సైతం సదరు కంపెనీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తీరు మార్చుకోవడం లేదు.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కోట్లాది రూపాయల మేర నిధులిస్తున్నారు.. చుట్టూ పెద్దఎత్తున అధికార యంత్రాంగం ఉంది. అయితే ఏం లాభం.. కనీసం అక్కడ ఏం జరుగుతుందో చూసే వారే కరువయ్యారు. విద్యార్థులు సమస్యల మధ్యే వసతి పొందుతున్నా పరిష్కరించే నాథులే కరువయ్యారు. ఇదెక్కడో కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో దుస్థితి. ఆ వసతి గృహాల్లో మంచినీటి ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన కాంట్రాక్టర్ గాలి కొదిలేయడంతో విద్యార్థులకు కలుషిత నీరే దిక్కుగా మారింది. అటు వందల సంఖ్యలో ఉండే విద్యార్థుల హాస్టళ్లలో ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయాల్సి ఉన్నా అదీ చేయడం లేదు. డ్రైనేజీ నిర్వహణ పట్టించు కోవడం లేదు. హాస్టల్ పరిసరాలను గాలికొదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో టెండరు దక్కించుకున్న తెలంగాణకు చెందిన ఈ కంపెనీ ప్రభుత్వం మారినా అదే అరాచకం కొనసాగిస్తోంది. అటు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి లేఖలు రాసినా కాంట్రాక్టర్ ఖాతరు ఏమాత్రం చేయడం లేదు. సదరు బిల్లులు భారీగా బొక్కేస్తూ స్థానికంగా ఓ ఇద్దరు తాత్కాలిక ప్రైవేటు ఉద్యోగులకు హాస్టళ్లను సబ్ కాంట్రాక్టుకు ఇచ్చేసి తన బాధ్యతను వదిలేశాడు.

నలుగురు ఎమ్మెల్యేలు చెప్పినా..

ఉమ్మడి జిల్లాలో అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో శానిటేషన్ కంపెనీ నిర్లక్ష్యంపై ఆయా ప్రిన్సిపాళ్లు ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం మారినా కంపెనీ వైఖరి ఏమాత్రం మారలేదని నివేదికలో వివరించారు. మొత్తం 15 అంశాల్లో కంపెనీ కనీసం ఆరు అంశాల్లో కూడా పారిశుధ్య నిర్వహణ పాటించడం లేదని రిమార్కులతో నివేదికలు పంపారు. వీటిని పరిశీలించి సరిదిద్దాల్సిన జిల్లా కోఆర్డినేటర్ సైతం కంపెనీపై చర్యలు తీసుకునేలా పైఅధికారులకు సిఫార్సులు చేయలేదు. మరోపక్క ఈ వసతి గృహాల్లో శానిటేషన్ ఘోరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కొంతకాలం కిందట స్థానిక ఎమ్మెల్యేలకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి నేరుగా లేఖలో ఫిర్యాదు చేశారు. అయినా కంపెనీ మాత్రం తన తీరు మార్చుకోలేదు.

13 వేల మంది విద్యార్థులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 21 చోట్ల అంబేడ్కర్ గురుకుల వసతి గృహాలు ఉన్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎస్సీ విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు వసతి అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఒక్కో వసతి గృహంలో 640 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 13 వేల మంది ఉంటున్నారు. గురుకులాల్లో పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చదు వు,వసతి ఉండేలా ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోంది. పారిశుధ్య నిర్వహణకు కాంట్రాక్టర్‌ను నియమించి నెలకు కోట్లలో బిల్లులు చెల్లిస్తోంది. శానిటేషన్ కాంట్రాక్టు పొందిన కంపెనీ ప్రతి వసతి గృహానికి సిబ్బందిని నియమించి యూనిఫాం ఇచ్చి పనులు చేయించాలి. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు అనుకూలంగా ఉండడంతో ఎక్కడికక్కడ స్థానికంగా ఓ మనిషిని పురమాయించి వారితో అరకొర పనులు చేయిస్తూ నెట్టుకొచ్చింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా సదరు కంపెనీ అదే నిర్లక్ష్యం కొనసాగిస్తోంది. వసతి గృహం ఉన్న ప్రాంతంలో ఓ పనిమనిషికి రూ.5 వేల వరకు ఇచ్చి తూతూమంత్రంగా పనులు చేయిస్తోంది. కంపెనీ కోట్లలో దండుకుంటోంది.

గతేడాదే గడువు ముగిసినా..

గతేడాదే ఈ కంపెనీకి టెండరు గడువు పూర్తయింది. కానీ గత వైసీపీ పెద్దలు మాత్రం పనితీరు ఏమాత్రం బాగోలేని కంపెనీకి దాసోహమయ్యారు. తిరిగి మరో ఏడాది కాంట్రాక్టు పొడిగిస్తూ గతేడాది అడ్డగోలుగా నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా ఇప్పటికీ ఈ సంస్థ సేవలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. అధికారులు సైతం రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో కంపెనీ నిర్లక్ష్యపు సేవలపై కనీసం సమీక్షించలేదు. మరోపక్క గురుకుల వసతి గృహాల్లో అప్పనంగా కోట్లలో డబ్బు బిల్లులు రూపంలో వస్తుండడంతో త్వరలో ముగిసిపోనున్న కాంట్రాక్టును మళ్లీ పొడిగించేందుకు సదరు కంపెనీ రాజకీయంగా పావులు కదుపుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచినా మళ్లీ తామే కొనసాగేలా తెరవెనుక మంత్రాంగం నడుపుతోంది.

విద్యార్థులకు కలుషిత నీరే తాగునీరు..

ఉమ్మడి జిల్లాలో 21 వసతిగృహాల శానిటేషన్ కాంట్రాక్టును గత వైసీపీ ప్రభుత్వం తన అనుకూలంగా ఉండే తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 2023లో ఇచ్చింది. సదరు కంపెనీ కొద్దినెలలు మినహా ఆ తర్వాత పారిశుధ్య నిర్వహణ గాలికొదిలేసింది. నిబంధనల ప్రకారం ఈ కంపెనీ ఆయా హాస్టళ్లలో సిబ్బందిని నియమించుకుని పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. మూడు నెలలకోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేసి మంచినీరందించాలి. అయితే ఏడాదిన్నరగా పూర్తిగా గాలికొదిలేసింది. హాస్టళ్లలో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. దీంతో విద్యార్థులు కలుషిత నీటినే తాగుతున్నారు. కొన్నిచోట్ల ఇవి పాడైపోవడంతో బోరు నీరు తాగాల్సిన పరిస్థితి. వేలాది మంది విద్యార్థులు ఉండే హాస్టళ్లలో సెప్టిక్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయించాలి.కానీ ఏడాదిన్నరగా పట్టించుకోవడం మానేసింది. దీంతో విద్యార్థులు దుర్వాసన మధ్యే వసతి పొందాల్సి వస్తోంది. హాస్టళ్లలో డ్రైనేజీ, ఇతర కాలువల్లో వ్యర్థాలు, ఇతర ఆహారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా సదరు కంపెనీ పట్టించుకోవడం లేదు. హాస్టళ్లన్నీ అపరిశుభ్ర వాతావరణంలో ఉంటున్నాయి. కానీ నెలనెలా మాత్రం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల బిల్లులు దండేసుకుంటోంది.

- అంబేడ్కర్ గురుకులాల్లో ఘోరం
- శానిటేషన్ నిర్వహణ గాలికి
- అపరిశుభ్రంగా హాస్టళ్లు
- గత వైసీపీలో కాంట్రాక్టు
- నలుగురు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- వసతిగృహాల ప్రిన్సిపాళ్ల నివేదికలు
- ఖాతరు చేయని కాంట్రాక్టు కంపెనీ
- మళ్లీ కాంట్రాక్టు పొడిగింపుపై కన్ను



తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం


ఊనగట్లలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి,ఆర్‌డీవో

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద గురువారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు,ఉచిత ఇసుక పాలసీ, రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఇసుక నిల్వలు, పీఎం కుసుమ్ పోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటు, భూ సంబంధ అంశాలు, ఎంఎస్‌ఎంఈ సర్వే, ఇండస్ట్రీయల్ పార్క్, స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై ఆరా తీసినట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉండే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ కే.తిలక్ కుమార్,డీపీవో వి.శాంతమణి,సివిల్ సప్లయిస్ డీఎం టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి..

చాగల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలో

రేపు ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మూడో శనివారం 4వ విడత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ థీమ్‌తో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరమ్మతుల కొచ్చిన కంప్యూటర్లు,ప్రింటర్లు, స్కానర్లు తీసేసి, ఆఫీ సులను శుభ్రంగా ఉంచాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కియోస్క్ స్టాల్స్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఒక చోటకు చేర్చాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రజల నుంచి ఈ-వేస్ట్ సేకరించాలని చెప్పారు.ప్రతి గ్రామంలో టాంటాం వేసి, ప్రజలకు అవగా హన కల్పించాలన్నారు

జిల్లా కలెక్టర్ గురువారం విస్తృత తనిఖీలు చేశారు.ఊనగట్లలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, బ్రాహ్మణగూడెంలో రీసర్వే జరుగుతున్న తీరు పరిశీలించి రైతులతోను మాటా_డారు. సచివాలయం సందర్శించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన సేవలందించాలని సూచించారు. రీసర్వే జరిగే సమయంలో రైతులు స్వయంగా పాల్గొని అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. మన మిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత,జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, ఇమ్యూనైజేషన్ అధికారి పి.కోమల, తహశీల్దార్ ఎం.మెరికమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య బదిలీ



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) రాజమండ్రి పోస్ట్ కమాం డర్ సైదయ్య హైదరాబాద్‌లోని ఆర్పీఎఫ్ క్రైం ఇంటెలిజెన్స్ బ్యూరోకి బదిలీఅయ్యారు. 2021లో ఇక్కడికి వచ్చిన సైదయ్య సమర్థవంత మైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.గరీబ్‌రథ్‌లో చోరీకి గురైన కిలోన్నర బంగారం, కిడ్నాప్‌కు గురైన 1.5ఏళ్ల చిన్నారి వంటి కేసులను ఛేదించారు. భద్రతపై ప్రయాణికులకు తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. సైదయ్య స్థానంలో హైదరాబాద్ నుంచి బి.రాజు వస్తున్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అందించే అత్యున్నత పద్మ పురస్కారాల (పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ) కోసం క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. 2026వ సంవత్సరానికి అంతర్జాతీయ క్రీడల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యున్నత ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



మూగజీవాల రోధన

పశువుల ఆసుపత్రుల్లో వైద్యులు లేక ఇక్కట్లు

- మురమండలో దారుణం
- 20 పశువులు మృత్యువాత
- పశు వైద్యులను నియమించాలి

కడియం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాల రోదన ఎవరికి పడుతుంది.. సమస్య ఉన్నా పట్టదు.. తెలిసినా పట్టించుకోరు..మూగజీవాలు మాత్రం ప్రాణాలతో పోరాడుతున్నాయి. వ్యవసాయాధారిత జిల్లా కావడంతో ప్రతి ఇంటా పాడిపంట కామన్.. అయితే జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో పశు వైద్యులు లేక రైతాంగం కొట్టుమిట్టాడుతున్నారు. పశువులైతే రోగాలకు తాళలేక మౌనంగా రోదిస్తున్నాయి. ఉదాహరణకు పాడిపరిశ్రమకు అధికంగా ఉండే మురమండ గ్రామంలో ప్రభుత్వ పశువైద్యశాలకు శాశ్వత పశువైద్యాధికారి లేరు.దీంతో గ్రామంలో పాడిరైతులు ఏలేటి శ్రీనివాస్‌కు చెందిన ఆవు, ఈదల శ్రీనివాస్‌కు చెందిన గేదె, పాడి రైతులు పుట్టా నారాయణరావు, పిల్లా అన్నవరం, సుంకర రాజుకు చెందిన పాడిదూడలు ఇలా సుమారు 20 పశువులు మృత్యువాత పడ్డాయి. ముర మండతో పాటు మాధవరాయుడుపాలెం,దుళ్ళ గ్రామ శివారుల్లో మురమండ గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో పాడిపెంపకం చేసే రైతులు పశువులను వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తీసుకొస్తారు. పశువులకు ఏదైనా సుస్తీ చేస్తే కొంత కాలంగా జేగురుపాడు పశువైద్యులు వచ్చి వైద్యసేవలందిస్తున్నారన్నారు.అటు జేగురుపాడు..ఇటు మురమండ వచ్చి పశువులకు వైద్యం అందించంతో సేవలు ఆలస్యమవుతున్నాయి.శాశ్వత వైద్యుడిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

పశువైద్యుడు లేక ఇబ్బంది..



కొంత కాలంగా మురమండ పశువుల ఆస్పత్రికి వైద్యుడు లేరు. గతంలో పశువైద్యులు, మరో ఇద్దరు సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం కేవలం ఒక వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నారు. జేగురుపాడు పశువైద్యుడే సేవలందిస్తు న్నారు. వెంటనే పశువైద్యుడిని నియమించాలి. - **మరిడి సత్యనారాయణ, రాష్ట్ర ఉత్తమ పాడిరైతు, మురమండ**



సైకిల్.. సారథులు..

60 మంది ఓటర్లకు ఒక సారథి

- టీడీపీలో సంస్థాగత సందడి
- కుటుంబ సారథుల నియామకం
- ఎల్లుండి వరకూ అవకాశం
- ఐదు నియోజకవర్గాల్లో జోరు
- రెండు చోట్ల వెనుకబాటు
- మే 15 వరకూ కమిటీల ఏర్పాటు
- షెడ్యూల్ ప్రకటించిన టీడీపీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికార తెలుగుదేశం ప్రభుత్వంలో సంస్థాగత సందడి మొదలైంది. కుటుంబ సాధికారి సారథుల పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. మే 15వ తేదీలోపు బూత్, గ్రామ కమిటీల నుంచి పార్లమెంట్, దాని అనుబంధ కమిటీల నియామకం పూర్తి చేసే లక్ష్యంతో పార్టీ ఇటీవల షెడ్యూల్ ప్రకటించింది. అన్ని నియోజకవర్గాల, పార్లమెంట్ సంస్థాగత ఎన్నికల్లో నేతలందరినీ సమన్వయపరచి సమర్థవంతంగా కమిటీలు పూర్తిచేయాలని అధిష్ఠానం ఆదేశించింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

వెనుబడిన నిడదవోలు, అనపర్తి

కుటుంబ సాధికార సారథి ఎన్నికలు ఈ నెల 14వ తేదీన ఆరంభం కాగా.. ఐదు నియోజకవర్గాల్లో ముందుండగా రెండు నియోజకవర్గాలు మాత్రం వెనుకబడ్డాయి. నిడ దవోలు, అనపర్తి నియోజకవర్గాలు వెనుకబడ్డా యి.ఈ మేరకు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అధిష్ఠానానికి సంస్థాగత ఎన్నికల కుటుంబ సాధికార సారథులు(కెఎస్ ఎస్) రిపోర్టు ఇచ్చారు.

- గోపాలపురం నియోజకవర్గంలో 80.86 శాతం నియామకాలు పూర్తయ్యాయి.మొత్తం 4044 కుటుంబ సాధికార సారథులు (కెఎస్ ఎస్) ఉన్నారు. ఒక్కో కెఎస్ఎస్‌లో ఇద్దరు సభ్యులు అంటే మొత్తం 8088 మంది ఉంటారు.ఇప్పటికే 6540 మందిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో నియ మించారు. ఇది మొదటి స్థానంలో నిలిచింది.
- రెండో స్థానంలో రాజమహేంద్రవరం సిటీ ఉంది. ఇక్కడ 4237 కెఎస్ఎస్‌లు, 8474 మంది కెఎస్ఎస్ సభ్యులు ఉంటారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నాయకత్వం లో 5615 మంది నియామకాలు పూర్తి చేశారు.
- మూడో స్థానంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఉంది.అక్కడ 4481 కెఎస్ఎస్‌లు ఉండగా 8962 మంది సభ్యులు ఉంటారు. ఇప్పటి వరూ 4184 మందిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నియమించారు.
- కొవ్వూరు 4వ స్థానంలో ఉంది. కెఎస్ఎస్‌లు 3060 మంది ఉన్నారు.6120 మంది సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 2513 మందిని నియమించారు.
- రాజానగరం ఐదో స్థానంలో ఉంది.ఇక్కడ పార్టీ ఇన్‌చార్జిగా రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఉన్నారు. మొత్తం 3599 మంది కెఎస్ఎస్‌లు ఉండగా అందులో 7198 మంది సభ్యులు ఉంటారు. ఇంత వరకూ 2794 మంది సభ్యులను నియమించారు.
- అనపర్తిలో టీడీపీ ఎమ్మెల్యే లేని పరిస్థితి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.కూటమిలో భాగంగా బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయినా తెలుగుదేశం కమిటీల నియామకంలో వెనుకబడింది.ఇక్కడ మొత్తం 3767 మంది కెఎస్ఎస్‌లు ఉండాలి. 7534 మంది సభ్యులు ఉండాలి. ఇంత వరకూ కేవలం 66 మంది నియామకం మాత్రమే పూర్తయింది. ఇది కేవలం 0.88 శాతం మాత్రమే.
- నిడదవోలు పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే లేరు. కూటమి తరపున జనసేన ఎమ్మెల్యేగా మంత్రి కందుల దుర్గేష్ ఉన్నారు. టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఉన్నారు. ఇక్కడ కెఎస్ఎస్‌ల నియామకం బాగా వెనకబడి ఉంది. మొత్తం 3542 మంది కెఎస్ఎస్‌లు..7084 మంది సభ్యులు ఉంటారు.ఇప్పటి వరకూ కేవలం 12 మంది సభ్యుల నియామకం మాత్రమే పూర్తయింది. ఇది కేవలం 0.17 శాతం మాత్రమే. టీడీపీకి ప్రతి చోట కేడర్ బలంగా ఉండడం వల్ల అక్కడక్కడా సమస్యలు ఉన్నా పరిష్కారమవుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



సంస్థాగత షెడ్యూల్ ఇలా..

టీడీపీ సంస్థాగత ఎన్నికల షెడ్యూల్‌ను అధిష్ఠానం ప్రకటించింది.ఈ నెల 14 నుంచి కుటుంబ సాధికారిత సారథుల నియామకం ఆరంభమైంది.60 మంది ఓటర్లకు ఓ కుటుంబ సాధికార సారథి (కెఎస్ఎస్)ఉంటారు. ఇందులో ఇద్దరు సభ్యులు మహిళ, పురుషుడు ఉంటారు.ఈ నెల 20వ తేదీలోపు కుటుంబ సాధికార సారథులను నియమించాలి. 22వ తేదీలోపు బూత్,గ్రామ కమిటీలు నియమించాలి. 23 నుంచి 30వ తేదీ లోపు క్లస్టర్, యూనిట్, మండల, పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీల నియామకం పూర్తి కావాలి.మే నెల 1 నుంచి 7 వరకూ నియోజకవర్గాల అనుబంధ కమిటీల నియా మకం జరగాలి.మే 8 నుంచి 15 వరకూ పార్లమెంట్, అనుబంధ కమిటీలు నియమించాలి.



పాపాలకు ప్రాయశ్చిత్తం.. లోకానికి వెలుగు మార్గం!

- పవిత్ర దినం పరిశుద్ధ శుక్రవారం
- చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు
- క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు
- ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలే శిరోధార్యం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు సిలువ వేసిన సందర్భాన్ని, ఆయన మరణాన్ని గుర్తుచేసుకునే రోజునే క్రైస్తవులు పవిత్రదినంగా భావిస్తారు. దీన్నే గుడ్ ఫ్రైడే, పవిత్ర శుక్రవారం, బ్లాక్ ఫ్రైడే, హోలీ ఫ్రైడే, గ్రేట్ ఫ్రైడే, గ్రేట్ అండ్ హోలీ ఫ్రైడే, లేదా లార్డ్ పాషన్ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. మానవాళిచేసిన పాపాల కోసం ప్రాయశిత్తంగా తన ప్రాణాలను ఏసుక్రీస్తు అర్పించాడని క్రైస్తవులంతా భావిస్తారు. ఆయనను శిలువకు వేలాడదీసిన రోజే పవిత్ర శుక్రవారంగా భావించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నిజానికిది బాధతో కూడిన రోజు కావడంతో ఎంతో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను జరుపుకోవడం చేస్తారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జిల్లాలో రామారావుపేట, గాంధీనగర్, జగన్నాథపురం ప్రాంతాల్లోని పురాతన చర్చిలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు ప్రాంతాల్లో చర్చిల్లో, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పురాతన చర్చిల్లో క్రైస్తవులంతా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు చర్చిల్లో ఆరాధనలు చేస్తారు. క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలు ధ్యానిస్తారు. ఈస్టర్ ఆదివారం ముందు వచ్చే శుక్రవారం రోజును క్రైస్తవులు పాపాలకు ప్రాయశ్చిత్త ంగా ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటారు. అలాగే ఏసు మరణానికి, ఆయన పునరుత్థానానికి మధ్య ఉన్న మూడు రోజులను పవిత్ర దినాలుగా భావిస్తారు. గుడ్‌ఫ్రైడే ఆరాధన.. అందరి పాపాల కోసం తన జీవితాన్ని త్యాగం చేయడం ద్వారా ఏసుక్రీస్తు అందరి కోసం అనుభవించిన బాధలను ప్రతిబింబించమని ఆహ్వానిస్తుంది. గుడ్‌ఫ్రై డే రోజున ప్రాయశ్చిత్తం, ప్రార్థనలు మాత్రమే చేసుకునే రోజు. ముఖ్యంగా ఈరోజు చర్చిల్లో గంటలు మోగించకూడదు. క్రైస్తవ ధర్మం పాటించేవారు మాంసాహారం తినరు. ఉపవాసం చేస్తారు. శిలువ వేసిన గుర్తుగా కొయ్యతో చేసిన శిలువలను ధరించి చర్చిల్లో ప్రార్థిస్తారు. అలా గే శిలువ కొయ్యలతో ప్రదర్శనగానూ నిర్వహిస్తారు. కొన్నిచోట్ల నల్లటి వస్త్రాలు ధరించి క్రీస్తును స్మరిస్తూ ముందుకు సాగుతారు. గుడ్‌ఫ్రైడే ప్రతి ఏటా తేదీ మారుతుంది. మూన్ క్యాలెండర్ ప్రకారం ఈస్టర్ ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్‌ఫ్రైడేగా చేసుకుంటారు. దీంతో లెంట్ డేస్ పూర్తవుతాయి. గుడ్‌ఫ్రైడే రోజు ఏసును శిలువ వేస్తే.. ఆదివారం పునరుత్థానం చెందాడని ఈస్టర్ పండుగ చేస్తారు.

యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలు


1. తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుకు వీరిని క్షమించుము. లుకా 23.34
2. నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు. లుకా 23.43
3. అమ్మా, ఇదిగో నీ కుమారుడు. ఇదిగో నీ తల్లి. యోహాను 19:26,27
4. నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివి. మత్తయి 27:46
5. నేను దప్పిగొని యున్నాను. యోహాను 19:28
6. సమాప్తమైనది. యోహాను 19:30
7. తండ్రి నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనియున్నాను. లుకా 23:46

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 20వ తేదీ వరకు

రేషన్‌లో బియ్యం

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో ఈ నెల 20వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 17వ తేదీతో రేషన్‌లో బియ్యం, పంచదార పంపిణీ గడువు ముగిసింది. అయితే లబ్ధిదారుల సౌకర్యార్థం గడువు మరో మూడు రోజులు పెంచారు. ఇప్పటి వరకు తూర్పుగోదావరి జిల్లాలో 5,64,994 రేషన్ కార్డుదారులకు గాను 5,19,660 మందికి రేషన్ సరుకుల పంపిణీ జరిగింది. అంటే 91.67 శాతం పంపిణీ నమోదు అయింది. అలాగే కాకినాడ జిల్లాలో 6,33,874 రేషన్ కార్డుదారులకు 5,80,432 కార్డుదారులకు పంపిణీ చేశారు. అంటే 90.14 శాతం రేషన్ పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5,37,902 రేషన్ కార్డుదారులకు 4,81,484 రేషన్ కార్డుదారులకు పంపిణీ చేశారు. ఇక్కడ 89.51 శాతం పంపిణీగా నమోదైంది. ఈ నేపథ్యంలో మరో మూడు రోజులు గడువు పెంచి నూరు శాతం లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం ప్రతి ఒక్క లబ్ధిదారుని ఇంటికి చేరుకోవాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది.

రక్తంతో ఏసుక్రీస్తు చిత్రం





చిత్రాన్ని వేసిన మండపల్లి శ్రీచరణ్

మండపేట శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ విద్యార్థి మండపల్లి శ్రీచరణ్ ఏసుక్రీస్తు పట్ల తన ఆరాధనా భావాన్ని ప్రత్యేక కోణంలో వ్యక్తం చేశాడు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసు చిత్రాన్ని గీసేందుకు తన రక్తాన్నే రంగులుగా మలుచుకున్నాడు. అతని కుంచె నుంచి జాలువారిన రక్త రేఖలతో రూపుదిద్దుకున్న ఏసు చిత్రం చూపరులను ఆకట్టుకుంటోంది. ఇంటర్ చదివిన శ్రీచరణ్ మండపల్లి సత్యానందం వద్ద చిత్రలేఖనం నేర్చుకుంటున్నాడు. - మండపేట/ఆంధ్రజ్యోతి

20న క్రికెట్ ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి పురుషులు అండర్-23, సీనియర్స్ ఎంపికలు జరుగుతున్నాయని జిల్లా సెక్రటరీ పి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 20న ఉదయం 9 గంటలకు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే ఎంపికలకు హాజరుకావాలని కోరారు. అండర్-23 పురుషులు కచ్చితంగా 2002 సెప్టెంబరు 1లోపు జన్మించి ఉండాలి. ఎంపికలకు హాజరయ్యే పురుషులు తప్పనిసరిగా తెల్లని దుస్తులు, బూట్లు, సొంత కిట్టు తీసుకురావాలి. జన్మదిన పత్రం, ఆధార్ కార్డు, స్కూల్ నుంచి టెన్త్ క్లాస్ మార్క్స్ సర్టిఫికెట్ తీసుకురావాలి.

ముగిసిన ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు



పరుగు పందెంలో...

కాకినాడ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో మూడు రోజులు జరిగిన ఏపీఎస్పీ రేంజ్-1, గేమ్స్, క్రీడా పోటీలు గురువారం సాయంత్రం ముగిసాయి. ముఖ్య అతిథిగా ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప హాజరయ్యారు. 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాన్ని తమ బెటాలియన్‌కు ఇచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి రాజకుమారి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఫకీరప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం చేయాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమాండెంట్లు రామకృష్ణ, సుస్మిత, అదనపు కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మన్మధరావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, రవిశంకర్, విఠలేశ్వరరావు, ప్రసాద్, 3వ బెటాలియన్ పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



పరుగో... పరుగు





విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఐజీ ఫకీరప్ప, 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు

సరళం, సులభం, సత్వర న్యాయం

ప్లాపస్!

- తెల్ల కాగితంపై ఫిర్యాదు రాసిస్తే చాలు
- విద్యుత్, తాగునీరు, వీధి దీపాలు, రవాణా, వైద్యం, విద్య ఇబ్బందులపై ఆధారాలు ఏదైనా సరే.. మెరిట్స్ ప్రకారం తీర్పు
- న్యాయవాది అవసరం లేదు..
- కోర్టు ఫీజు ఉండదు
- తీర్పుపై అప్పీలుకు అవకాశం లేదు
- కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదు



ఆస్పత్రిలో వైద్యపరంగా ఇబ్బంది ఉందా?... బీమా, విద్యా సంస్థలు ఇబ్బంది పెడుతున్నాయా?... తాగునీరు, వీధి దీపాల సమస్య ఉందా?... ప్రభుత్వాధికారులకు విన్నవించినా పట్టించుకోవట్లేదా?... న్యాయం జరగట్లేదని నిస్సహాయ స్థితిలో ఉన్నారా?... దిక్కెవరని కుమిలిపోతున్నారా?.. వీటన్నిటికీ సమాధానమే 'ప్లాపస్'. ప్రజల దైనందిన జీవనంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు అద్భుతమైన పరిష్కార వేదిక. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఎంతో అమూల్యమైన సేవలు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఒక జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిగి తీర్పు (అవార్డు) ఇచ్చే సంస్థను జనం ఉపయోగించుకోలేకపోతున్నారు. సహజ న్యాయసూత్రాలే ప్రాతిపదికగా, కోర్టు ఫీజులు లేకుండా, సరళమైన ప్రక్రియతో త్వరితగతిన న్యాయం అందించే అధికారాలున్న 'ప్లాపస్'పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్'నే ప్లాపస్ అంటారు. న్యాయ సేవాధికారాల చట్టం-1987కి 37/2002 సవరణలో చాప్టర్ 6(ఎ)లో సెక్షన్లు 22(ఎ) నుంచి (ఇ) వరకు తెలియజేశారు. త్వరితంగా, ఇంపార్షియల్‌గా ప్రజలకు సేవలందించడం, మామూలు కోర్టులపై పని ఒత్తిడి భారాన్ని తగ్గించడం ప్లాపస్ ముఖ్య ఉద్దేశాలు. ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి 2016లో ప్లాపస్ మనుగడలోకి వచ్చింది. ఒక చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు విచారణ జరిపి మెజారిటీ అభిప్రాయాన్ని తీర్పుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ (లోక్ అదాలత్)లు ఉన్నా వాటి విధులకు ప్లాపస్‌కి స్పష్టమైన తేడా ఉంది. ఇరుపక్షాలు రాజీ పడకపోతే లోక్ అదాలత్‌లు ఏ పక్షానా తీర్పు ఇవ్వడానికి కుదరదు. ప్లాపస్‌లో మాత్రం ఆధారాలు, మెరిట్స్‌ని అనుసరించి తీర్పు వెలువరిస్తారు.



● ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి తూర్పు గోదావరికి సంబంధించి రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుల ప్రాంగణంలో లోక్ అదాలత్ భవనం మొదటి అంతస్తులో ప్లాపస్ ఉంది. ఇక్కడికి నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ చదువు రాకపోయినా దిగాలు చెందాల్సిన అవసరం లేదు. లీగల్ ఎయిడ్ సిబ్బంది సహాయం చేస్తారు. ఏ భాషకు చెందిన వారైనా ఇబ్బంది ఉండదు.

● ప్రక్రియ ఇలా...

ప్రజలకు అవసరమై సాధారణంగా ప్రభుత్వ నియంత్రణలో ఉండే సేవలైన విద్యుత్, నీరు, రవాణా, వైద్యం, టెలిఫోన్ సేవల్లో ఇబ్బందులు ఏర్పడితే ముందుగా సాధారణంగా సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేయడానికి ప్రయత్నించాలి. అప్పటికీ సమస్య తీరకపోతే నేరుగా ప్లాపస్‌కి వెళ్లవచ్చు. ఒక తెల్ల కాగితంపై అర్జీ రాసి ఇవ్వాలి. ఎవరికైతే నోటీసు పంపించాలో వారి అడ్రసు స్పష్టంగా తెలియజేయాలి. ప్లాపస్ పిటిషన్ స్వీకరించిన తర్వాత ప్రత్యర్థులకు నోటీసు పంపించి రాతపూర్వక సమాధానం తీసుకుని రాజీమార్గం ద్వారా పరిష్కారానికి ప్రయత్నం చేస్తుంది. ఆ విధంగా పరిష్కారం కుదరని పక్షంలో ఇరువైపులా విచారించి తీర్పు ఇచ్చే సందర్భాల్లో సహజ న్యాయ సూత్రాలను ప్లాపస్ అనుసరిస్తుంది. సీపీసీ, ఎవిడెన్స్ యాక్టులతో సంబంధం ఉండదు. గరిష్ఠంగా 3-4 నెలల్లో పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ తీర్పు (అవార్డు)పై పౌర కోర్టుల్లో అప్పీలు చేసుకోడానికి వీలుండదు.

● ఏ ఇబ్బందులకు పరిష్కారం?

రూ.కోటి విలువ కలిగిన వ్యాజ్యాలకు ప్లాపస్‌లో విచారించే అధికారం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు నిర్వహించే రోడ్డు, విమాన, ప్రజా, వస్తు రవాణా, పోస్టల్, ప్రైవేటు కొరియర్, బీఎస్ఎన్ఎల్, ప్రైవేటు ఫోన్ ఆపరేటర్లకు సంబంధించిన వివాదాలు.. విద్యుత్తు, తాగునీరు సరఫరా, కరెంట్ షాక్ వల్ల కలిగే ప్రమాదాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యం, బీమా సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్సు, ప్రైవేటు, పబ్లిక్ విద్యా సంస్థలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ, ప్రజారోగ్య, పారిశుధ్య, ప్రజా సంరక్షణకు సంబంధించి సేవలు, వీధుల్లో మురుగునీటి సమస్య.. రాష్ట్ర హౌసింగ్ బోర్డు, కార్పొరేషన్, గృహ నిర్మాణ సొసైటీలు, ప్రైవేటు నిర్మాణదారులతో నిర్మాణాలకు సంబంధించిన వివాదాలకు సంబంధించి రాజీ మార్గంలో పరిష్కారానికి ప్రయత్నం చేస్తారు. ఒకవేళ రాజీ కుదరకపోతే విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు. పది పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లోని సేవా లోపాలు, వివాదాలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా, న్యాయవాది అవసరం లేకుండా వేగంగా పరిష్కారం లభిస్తుంది. పిటిషన్ వేయడానికి ఒక ఫార్మాట్ అంటూ ఉండదు. ప్రజలు వారికి తోచిన సరళమైన భాషలో పిటిషన్ రాయవచ్చు. ఒకవేళ రాయడం రాకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుంది.

ఇవిగో కేసులు.. పరిష్కారాలు..

● అనపర్తి మండలానికి చెందిన ఒక బాలిక పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల్లోని ఓ పేరులో ఇంగ్లిషు అక్షరాల్లో తప్పుదొర్లింది. విద్యా శాఖ అధిరుల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఆ బాలిక ప్లాపస్‌ని ఆశ్రయించింది. ప్లాపస్ ప్రక్రియ ప్రారంభించింది. 15 రోజుల్లో ఎస్ఎస్‌సీ బోర్డు పేరు సరిజేసి పంపిన సర్టిఫికెట్‌ను ఆ బాలిక చేతికి ప్లాపస్ అందజేసింది.

● రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ బ్యాంకులోను తీర్చేశారు. కానీ ఆమె హామీగా ఇచ్చిన దస్తావేజులను ఇవ్వడానికి మాత్రం బ్యాంకు అధికారులు పదేపదే తిప్పించుకున్నారు. బాధితురాలు ప్లాపస్‌ను ఆశ్రయించగా ఇరువైపులా వాదనల అనంతరం రెండు వారాల్లో ఆమెకు దస్తావేజులు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

● రాజానగరానికి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారని, దుర్వాసన వస్తోందని, హానికరంగా ఉందని ప్లాపస్‌లో ఫిర్యాదు ఇచ్చారు. వెంటనే చెత్తను తరలించి ఆ ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ప్లాపస్ ఆదేశించింది.

- వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో ఎట్టకేలకు కీలక అడుగు
- పోలీసు దర్యాప్తునకు సహకరించేందుకు ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హత్య కేసుపై మొదటి నుంచీ సుబ్రహ్మణ్యం కుటుంబం తరపున ముప్పాళ్ల పోరాటం

'అనంత'పాపాలు పండేనా?

(కాకినాడ/రాజమహేంద్రవరం సిటీ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు కేసు విచారణ పూర్తిగా పక్కనపడిపోయిన నేపథ్యంలో కేసు మరింత లోతుగా విచారణ జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోలీసు విచారణకు సహకరించేందుకు వీలుగా రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ న్యాయవాది, మానవ హక్కుల నేత ముప్పాళ్ల సుబ్బారావును నియమించింది. హత్య కేసులో ప్రాసిక్యూషన్‌కు సహాయం చేయడానికి వీలుగా సుబ్బారావును నియమిస్తున్నట్లు హోంశాఖ గురువారం జారీ చేసిన జీవో నెం.538లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇన్నేళ్లపాటు మూలనపడిపోయిన హత్య కేసు విచారణ ఇకపై మరింత లోతుగా జరగనుంది. ఈ హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుపై ముప్పాళ్ల సుబ్బారావు తొలి నుంచీ పోరాటం చేస్తున్నారు. హత్య కేసు నమోదు నుంచి ఛార్జిషీట్ దాఖలు వరకు అప్పటి ప్రభుత్వం కేసును ఎలా నీరుగార్చేలా వ్యవహరించిందనేదానిపై ఆయన న్యాయపరంగా పోరాటం చేస్తున్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయపరంగా మూడేళ్ల నుంచి సహకరిస్తున్నారు.

ఎంత అరాచకమో....

ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత కాకినాడ బీచ్ రోడ్డులో దారుణంగా దాడి చేసి కొట్టి చంపాడు. మే 19 తెల్లవారుజామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో డ్రైవర్ ఇంటికే తీసుకువెళ్లి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. కుటుంబీకులు తిరగబడ్డంతో అంత్యక్రియలకు డబ్బులు ఇస్తానని, నోరు తెరవొద్దని బెదిరించాడు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో అనంతబాబు కోసం పోలీసులు కనీసం గాలించలేదు. మీడియా ఒత్తిడితో గాలింపు ముమ్మరం చేయగా హత్య తానే చేశానని పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. తీరా అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు కేసును నీరుగార్చడం కోసం కేవలం అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించారు. కానీ బాధితులు, దళిత సంఘాల ఆందోళనతో చివరకు కేసును హత్యకేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులోను అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారు. కొన్నాళ్లకు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు.

ముప్పాళ్ల పోరాటం ...



కేసు దర్యాప్తును పోలీసులు పూర్తిగా నీరుగార్చేశారు. ఇదే విషయమై సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పోరాటం చేశారు. బెయిల్ రద్దు, విచారణ లోతుగా జరిగేలా పోరాటం చేశారు. ప్రభుత్వం మారాక కేసు విచారణ వేగంగా జరుగుతుందని భావించినా కొంత ఆలస్యం అయింది. ఇటీవల కేసుకు సంబంధించి దర్యాప్తు లోపాలు, ఇతర ఆధారాలను ముప్పాళ్ల ప్రభుత్వానికి వివరించారు. ఈ నేపథ్యంలో కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్ల సహకారం పోలీసు లకు అవసరమని ప్రభుత్వం భావించింది. కేసు తదుపరి దర్యాప్తునకు పోలీసులకు సహకారం అందించి పురోగతి వచ్చేలా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో బాధితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



నీటి విలువ తెలుసుకో.. పొదుపుగా వాడుకో అంటుంటారు పెద్దలు.. సమయానికి చుక్క నీరు లేకపోతే ప్రాణాలే పోతాయి.. ఈ దృశ్యాలే అందుకు నిదర్శనం. భానుడు మండిపడుతున్నాడు.. ఉదయం 10 గంటలు దాటిన తరువాత బయటకు రావాలంటేనే భయపడేంతగా ప్రతాపం చూపుతున్నాడు..దీంతో 11 గంటలకే రోడ్లన్నీ కర్ఫ్యూని తలపిస్తున్నాయి.. ఎండను తట్టుకోలేక గూడు ఉన్న వారు గూటికి చేరుతుంటే గూడు లేని వారు అపసోపాలు పడుతున్నారు.. ఈ చిత్రంలో భిచ్చగాడిని చూశారా.. వయసు 70పైనే ఉంటుంది.. చాలా కాలంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతంలో ఉంటున్నాడు.. గురువారం మధ్యాహ్నం ఎండను తాళలేకపోయాడు.. ఉక్కబోతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఎక్కడైనా నీళ్లు దొరక్కపోతాయా అని అటూ ఇటూ చూశాడు.. ఆ సమయానికి కుళాయిలు రావు.. ఎవరింటికైనా వెళ్లినా నీళ్లివ్వరు.. అంతే అటుగా వెళుతూ వాటర్ ఫౌంటైన్‌లో ఉన్న నీటిని చూశాడు.. ప్రాణం లేచివచ్చినట్టు అనిపించింది. వెంటనే ఆ నీటిని కొద్దిగా సేవించి.. వేడిగా ఉన్నా ఆ నీటితోనే ముఖం కడుక్కుని సేదతీరాడు.. ప్రభుత్వం గ్రామాల్లో పశువుల కోసం వాటర్ పాండ్‌లు కట్టేందుకు సమాయత్తమైంది..నగరాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేసవిలోనైనా నిత్యం నీటి సదుపాయం ఉండే ఏర్పాట్లు చేస్తే ఇటువంటి వారికి ఇబ్బందే ఉండదు.. సర్కారు ఆ దిశగా ఆలోచించాల్సిందే.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఈదురు గాలులకు కూలిపోయిన

132 కేవీ విద్యుత్ టవర్

- సుందరపల్లి పంటపొలాల్లో ఘటన
- కోనసీమలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- టవర్ పునరుద్ధరణ పనులు పరిశీలించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

కె.గంగవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న మంగళవారం మండలంలో వీచిన ఈదురుగాలులకు సుందరపల్లి గ్రామ పరిధిలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్‌శాఖకు చెందిన 132 కేవీ టవర్ కూలిపోయింది. దీనివలన కోనసీమలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మూరు నుంచి రామచంద్రపురం అక్కడి నుంచి వయా కె.గంగవరం మండలంలోని పలు గ్రామాలను కలుపుకుంటూ గోదావరినది దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, ముమ్మిడివరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ లైన్‌లో టవర్ కూలిపోవడంతో కోనసీమ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. అయితే వేరే ప్రాంతాల నుంచి విద్యుత్ సరఫరా తీసుకుని కోనసీమ ప్రాంతాల్లో అరకొర సరఫరా చేశారు. దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. దీంతో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)లు ఆర్డీవో దేవర కొండ అఖిల, విద్యుత్ శాఖ డిస్కం అధికారులతో కలిసి టవర్ పునరుద్ధరణ పనులు స్వయంగా పరిశీలించారు. త్వరితగతిన టవర్ నిర్మాణం పూర్తిచేసి గురువారం రాత్రికల్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో సీఈ శ్యాంప్రసాద్, ఎస్ఈ గురుబాబు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏడీ జీవవీవీ సత్యనారాయణ, ఏఈ వెంక టేశ్వర రావులు, తహశీల్దార్ బండి మృ త్యుంజయరావు వారి వెంట ఉన్నారు.


సుందరపల్లి వద్ద పడిపోయిన విద్యుత్ టవర్


మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌లకు టవర్ పునరుద్ధరిస్తున్న పనులు వివరిస్తున్న ఆర్డీవో అఖిలప్రియ

రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తాం

టవర్ పడిపోవడం వలన, టవర్ పునరుద్ధరణ సమయంలో చేతికి వచ్చిన పంట పాడైందని స్థానిక రైతులు మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌కు విన్నవించారు. దీనిపై ఆయన రైతులు ఆందోళన చెందవద్దని, నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. ఆర్డీవో డి.అఖిలప్రియతో నష్టం అంచనాలు వేయించాలని, పరిహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సలాది రమేష్, శీరెడ్డి సత్తిబాబు, తాడాల జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గొడౌన్‌లో పేలుడు

- పంగిడిలో ఘటన..
- తప్పిన ప్రాణాపాయం
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడిలోని బాణసంచా గొడౌన్‌లో పేలుడు సంభవించింది. ప్రమాద సమయం లో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు. సూర్యకారం, గంధకం, బొగ్గు నిలవచేసి ఉంచారు. అలాగే 150 జువ్వలు, 50 బొట్లు, 4000 టపాకాయలు, సుమారు 15 కిలోలు తయారు చేసినవి, రా మెటీరియల్ 15 కిలోలు మొత్తం 30 కేజీల ఫైర్ మెటీరియల్ గొడౌన్‌లో ఉన్నాయి. ఒకవైపు ఎండ వేడిమి, మరో వైపు గొడౌన్ తలుపులు మూసేసి ఉండడంతో ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. కొవ్వూరు మండ లం ఐ.పంగిడి, చాగల్లు మండలం మీనానగరం మ ధ్యలో ఉన్న నఫీజ్ బాణసంచా గొడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచా తయారీ యూనిట్‌లను పరిశీలించి తగిన భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీదారులు లైసెన్సుల కాలపరిమితి ముగిసిన వారిని గుర్తించి రెన్యూవల్ అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా భద్రపరిచే గొడౌన్‌ల వద్ద తగిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పంగిడిలో నసీఫ్ ఫైర్‌క్రాకర్స్‌కు ఇచ్చిన అనుమతి మార్చి 31వ తేదీతో ముగిసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా బాణసంచా భద్రపరిచే గొడౌన్‌లను పోలీసు, రెవెన్యూ, ఫైర్, స్థానిక సంస్థల అధికారుల బృందం పర్యవేక్షించి లైసెన్సులు లేకపోయినా, తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోయిన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌ఎఫ్‌వో ఈ.స్వామి, డీఎఫ్‌వో మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, రూరల్ సీఐ కె.విజయబాబు, ఫైర్ అధికారి వేణు, ఎస్ఐ కె.శ్రీహరిరావు ఉన్నారు.



కొవ్వూరు మండలం పంగిడిలో అగ్నికి ఆహుతైన బాణసంచా గొడౌన్, పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి




మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్, విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న అతిథులు

క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం

- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వృత్తి, ఆరోగ్యరీత్యా మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు దోహదపడతాయని కాకినాడజిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో గురువారం యూసీఈకే క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షుడిగా, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ బిందుమాధవ్, గౌరవ అతిథులుగా భారత బీచ్ వాలీబాల్ జట్టు కెప్టెన్, అంతర్జాతీయ వాలీబాల్, బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ఎంసీహెచ్ఆర్ కృష్ణంరాజు, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే వారి సంఖ్యను చూసి భయపడుతున్నారన్నారు. కానీ ఉన్న ఉద్యోగాల్లో మనకు కావాల్సింది ఒక్కటేనని గుర్తుచేసుకుని విజయం సాధించాలన్నారు. కృష్ణంరాజు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు క్రెడిట్ పాయింట్స్ ఇస్తున్న వర్శిటీ జేఎన్టీయూకే ఒక్కటేనన్నారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలద్వారా పట్టుదల, కార్యసిద్ధి మెరుగుపడి ఒత్తిడిని జయించవచ్చన్నారు. 2024-25 వార్షిక క్రీడా నివేదికను శ్యామ్ కుమార్ సమర్పించారు. వర్శిటీ తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు, విజేతలకు, పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు, ప్రతిభా పత్రాలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు మాజీ వైస్ చాన్సలర్లు, డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేల్స్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్‌పై విచారణకు ఆదేశం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజన్ సేల్స్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.సత్య ప్రకాష్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీసీఎస్‌టీ డిప్యూటీ కమిషనర్ ఏబీ హర్షవర్ధన్‌ను విచారణాధికారిగా నియమించింది. సత్యప్రకాష్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఒంగోలుకు చెందిన ఓ కంపెనీ డీలరుకు నిబంధనలకు విరుద్ధంగా రూ.16.50లక్షలు టాక్స్ రిఫండ్ చేశారు. లోతుగా విచారణ చేసిన ప్రభుత్వం లోపాలను గుర్తించడానికి విచారణకు ఆదే శించింది.గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరు మహిళల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెద బ్రహ్మదేవం కెనాల్‌రోడ్లో లారీని అతివే గంగా నడుపుతూ రోడ్డు పక్కన నడిచి వెళుతున్న ఇద్దరు మహిళలను ఢీకొనడంతో సదరు ఇద్దరు మహిళలు మృతి చెందడానికి కారకుడైన లారీ డ్రైవర్ అనకాపల్లి జిల్లా గుట్టివాడకు చెందిన అద్దం భాస్కరరావుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో కోర్టు మేజిస్ట్రేట్ షేక్‌నరీన్ తీర్పునిచ్చినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ గురువారం సాయంత్రం తెలిపారు. 10 నవంబరు 2022లో జరిగిన ఈ ప్రమాదంపై అప్పటి ఎస్ఐ సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ రఘువీర్ వాదించగా సాక్షులను కోర్టు కాని స్టేబుల్ సతీష్ ప్రవేశపెట్టగా తుది తీర్పును గురువారం ప్రకటించినట్లు సీఐ చెప్పారు.

విధుల నుంచి సెక్యూరిటీ గార్డు తొలగింపు

అన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం కొండపై పార్కింగ్ ఏరియాలో విధుల్లో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు బహిరంగంగా దూమపానం చేయడం విధితమే. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో రావడంతో భద్రతా అధికారులు స్పందించి అతనిని విధుల నుంచి తప్పించాలని సంబంధిత సెక్యూరిటీ ఏజెన్సీకి తెలపడంతో వారు అతడిని తొలగించారు.

10న జాతీయ లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన ప్రమాదాల కేసులను మే 10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించాల ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. పెం డింగ్‌లో ఉన్న ఆ తరహా కేసుల జాబితాను డీఎల్ ఎస్ఏకి అందజేయాలని సూచించారు. బాధితులకు తగు పరిహారం అందజేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముందస్తు లోక్‌అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థల ప్రతినిధులు, ప్రమాద కేసుల్లోని బాధితులు, ఇరుపక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జీపీసీహెచ్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపరాదు

స్త్రీ, పురుషులతో సమానంగా ట్రాన్స్‌జెండర్లకూ హక్కులు ఉన్నాయని, వారిపట్ల వివక్ష చూపరాదని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గాయత్రి దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులపై గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, స్వయం ఉపాధి అవకాశాలపై వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ ఎస్ఏ తరపున చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.రమేశ్ బాబు పాల్గొన్నారు.

తునిలో యువకుడి అనుమానాస్పద మృతి

తునిరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణం ఎమ్మార్‌పేటలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనం రేకెత్తించింది. అనకాపల్లి జిల్లా రాంపల్లి మండలం సీతపాలెం గ్రామానికి చెందిన రుత్తుల లీలామాధవ్(23) కొద్దికాలంగా కేశవరంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల తుని పట్టణం ఎమ్మార్‌పేటలో అద్దెకి దిగిన ఆ యువకుడు అదే ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. సాయంత్రం అయినా గది తలుపులు తెరవకపోవడంతో ఇంటి యజమాని పరిశీలించగా లీలామదన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. విషయాన్ని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి సీఐ గీతారామకృష్ణ, ఎస్ఐలు చేరుకుని పరిశీలించారు. పోలీసుల సమాచారంతో మృతుడి తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడు ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్నాడని, పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెట్టాడని, ఈ కారణంగానే తమ కొడుకు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. శవ పంచనమాలు నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.


ఎంఆర్‌పేటలో అనుమానాస్పదంగా మృతి చెందిన యువకుడు

రైలులో నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- బంగారం, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం


పట్టుబడిన సొత్తుతో రైల్వే పోలీసులు

తునిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైళ్లలోను, రైలుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులవద్ద బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, నగదు దొంగిలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజమండ్రి రైల్వే డీఎస్పీ జయరాం ప్రసాద్ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రేగుపాలేనికి చెందిన షేక్ యాసిన్‌బాబా అనే వ్యక్తిని తుని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై పట్టుకుని ఆరా తీయగా ఆయన వద్ద రెండు గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

ఉన్నతమైన ఆలోచనలు జీవితాన్ని మారుస్తాయి

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- యూసీఈకే వార్షికోత్సవ వేడుకలు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నతమైన ఆలోచనలు జీ వితాన్ని మారుస్తాయని కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే వార్షికోత్సవ వేడుకలను గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యనభ్యసించడం ప్రతిఒక్కరి జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకమన్నారు. గౌరవఅతిథి, వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యను కేవలం మార్కులతోనే సరిపెట్టకూడదని, విద్యద్వారా నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అకడమిక్, ఎండోమెంట్ అవార్డులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అని బురిడీ కొట్టిస్తున్న వ్యక్తి ఆచూకీ తెలపండి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పోలీసు అని చెప్పి ప్రజలను బెదిరించి అమాయకులవద్ద డబ్బులు కాజేస్తున్న వ్యక్తి ఆచూకీ తెలపాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు కోరారు. నిందితుడి వాహనంతో ఉన్న ఫొటో వివరాలను గురువారం విలేఖరులకు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో నిందితుడు మారుతి వెలోనో డెల్టా కారు నెంబరు ఏపీ16 ఎఫ్‌డీ 3060 నీలి రంగు వాహనంలో పోలీసు బోర్డు పెట్టుకుని కలియ తిరుగుతూ ప్రజలను మోసగించి డబ్బులు గుంజుతున్నాడని తెలిపారు. ఇతడి ఆచూకీని రాజమహేంద్రవరం టూ టౌన్ సీఐ 9440796576 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.


ఆచూకీ తెలపాలంటూ పోలీసులు విడుదల చేసిన నిందితుడు

రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల లేని పేదలకు ఇంటి స్థలాల కోసం ఎనిమిది నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా సమితి నాయకత్వంలో ఇంటి స్థలం కోసం పేదల గోడు పేరుతో రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల కోసం వచ్చిన వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంచాలన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోందని, ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు ఆవ ప్రాంతం నుంచి ప్రదర్శనగా ఇళ్లస్థలాల అర్జీదారులతో కలసి ఆదునిక మేకల కబేళా పక్కనున్న ప్రభుత్వ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఎర్రజెండా పాతి కొబ్బరికాయ కొట్టి ఈ స్థలాన్ని పేదలకు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జట్ల సంఘం అధ్యక్షుడు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సప్పరమణ, లావణ్య, ఇతర నాయకులు, ఆవ, పరిసర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అక్కినేని వనజ, తదితరులు

మోతుగూడెం బాలుడికి గిన్నిస్ బుక్‌లో చోటు

మోతుగూడెం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వేముల ఇజ్రాయిల్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. 2024 డిసెంబరు ఒకటిన ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన సంగీత కచేరీలో ఇజ్రాయిల్ పాల్గొన్నాడు. కీబోర్డు ద్వారా ఒకే సారి 18 దేశాలకు చెందిన 1050 మంది వాయిద్యకారులతో కలిసి పాల్గొని గంట వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో నిర్వాహకులు ఈ ధ్రువ పత్రం అందజేశారు. ఇజ్రాయిల్ పొల్లూరు గ్రామంలోని చర్చిపాస్టర్ వేముల అబ్రహం, సత్యశీల కుమారుడు. మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోంస న్, ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ విద్యార్థిని అభినందించారు. గిన్నిస్ బుక్‌లో పొల్లూరు బాలుడికి చోటు దక్కింది. ఈ బాలుడికి సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవ రావు ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, మోతుగూడెం ఇన్‌చార్జ్ ఎస్ఐ శివకుమార్, పంచాయతీ సెక్రటరీ జి.మోహన్, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లె రఘురాం బాలుడికి అభినందనలు తెలిపారు.



ఇజ్రాయిల్‌కి గిన్నిస్ బుక్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

విద్యకు కూటమి పెద్దపీట

ఎమ్మెల్యేలు గోరంట్ల, చినరాజప్ప



జయరాజు సత్కారసభలో ఎమ్మెల్యేలు గోరంట్ల, చినరాజప్ప,

కడియం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి విద్యకు పెద్దపీట వేస్తోందని ఎమెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. వేమగిరితోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి కంచపు జయరాజు పదవీ విరమణ వచ్చే నెల 31న జరగనుంది. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో గురువారం స్థానిక మం డల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జయరాజు సత్కార, అభినందన సభ నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యేలు గోరంట్ల, చినరాజప్ప, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, టీడీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, టూరిజం డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు విచ్చేసి జయరాజు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కూటమి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, కురుకూరు కిషోర్, ఎంఈవో మణికుమార్,మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్‌లైన్ రామాలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అడిషనల్ ఎస్పీలు

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జాంపేటలోని జిల్లా రిజర్వ్ పోలీస్ లైన్‌లోని శ్రీ కోదండ రామాలయం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీలు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం వంటి శ్రేష్ఠమైన కార్యక్రమాలు అందరి మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని, ఇది మన సంస్కృతి గొప్పదనమని భావితరాలకు తెలియజేస్తాయని, సీతారాముల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ(అడ్మిన్), ఏవీ సుబ్బరాజు(లా అండ్ ఆర్డర్), ఎల్.చించిరెడ్డి(ఏఆర్), డీఎస్పీ ఎస్‌బీప శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ (డీసీఆర్‌బీ) పవన్‌కుమార్‌రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బోధనాసుపత్రిలో మజ్జిగ చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ సూర్యప్రభ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ అన్నారు. గురువారం ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో రిటైర్డు పోలీసు ఉద్యోగి రుద్రబాబు తన తల్లిదండ్రుల స్మారకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సూపరింటెండెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పులిహోర, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్‌అవుట్‌పోస్టు సిబ్బంది శ్రీదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చంద్రమౌళి, డీఈ కృష్ణారావు, హెచ్‌డీఎస్ సభ్యురాలు ఉమాదేవి, రుద్రబాబు కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

35 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సౌత్ ఎక్సైజ్ స్టేషను పరిధిలోని రఘునాథపురం, శాటిలైట్ సిటీ, నామవరం గ్రామాల్లోని సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించారు. 8వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఎల్.శ్రీను, పసల సత్తిబాబు, గోనబోయిన నారాయణ మూర్తి, రేలంగి శ్రీను, వెలుగంటి గంగరాజుపై కేసు నమోదు చేశారు.

కంపు కొడుతున్న కార్పొరేషన్

- ఆక్రమణల తొలగింపు వ్యర్థాలతో నిండిపోయిన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రాంగణం
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం



కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని చెత్తాచెదారం





రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్ర జ్యోతి): సొంత ఇళ్లే చక్కబెట్టుకోలేని వారు ఊరిని ఉద్ధరిస్తారా అని రాజమహేంద్రవరం సిటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.. అలా అని ఎందుకు అంటున్నారంటే..

రాజమహేంద్రవరాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.. నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుద్దాం.. అంటూ ఒక పక్క నినాదాలతో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ హోరెత్తిస్తున్నారు. తీరా నగరంలో కంటే కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో వాస్తవ స్థితి అధ్వానంగా ఉంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయమా ? లేక డంపింగ్ యార్డా అన్నట్లుగా కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణం మారిపోయింది. నగరంలో ఆక్రమణల తొలగింపుల్లో తీసుకొచ్చిన వాటితో అదొక చెత్త కూపంగా తయారైంది. నగరంలో రహదారులను ఆక్రమంచిన చిరువ్యాపారులు, రోడ్డు పక్కన పెట్టిన తోపుడు బళ్లు, పైపులు, ఫ్లెక్సీలు, జెండాలు, ఇలా అనేక రకాల వేస్ట్ మెటీరియల్‌ను కార్పొరేషన్‌కు తరలించి అధికారులు వాటిని పార్కులో కుప్పలుగా పోసి వదిలేశారు. ఇవి నెలల తరబడి అలాగే ఉండిపోయి చెత్తగా మారిపోయాయి. వాటిలో పురుగుపుట్ర చేరి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఫ్లెక్సీలు చిన్నపాటి మురుగునీటి మడుగుల్లా మారి దోమల ఉత్పత్తి కేంద్రాలయ్యాయి. అటుగా వెళ్తేనే దారుణంగా కంపుకొడుతోంది. పరిశుభ్రతగా ఉంచండని ప్రజలను చైతన్యం చేయడానికి ఏర్పాటు చేసిన మంకీ డస్ట్ బిన్నులు ఇప్పుడు వేస్ట్‌లో చేరిపోయాయి. తినేసి వదిలేసిన భోజనాల ప్యాకెట్లు కుళ్లిపోయి దర్శనమిస్తున్నాయి. ఇలాగే వుంటే రోగాలు ప్రజలకు కాదు కార్పొరేషన్ సిబ్బందికే ముందు వచ్చే ప్రమాదముంది. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు చెబుతున్న అధికారులు తమ కార్యాలయాన్నే అపరిశుభ్రంగా ఉంచుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

రాజమహేంద్రిలో మెడికల్ జోన్ల ఏర్పాట్లపై సమీక్ష

అభిప్రాయాలు ప్రాజెక్టు ప్రపోజల్ రూపంలో చూపించాలి : కమిషనర్



ఐఎంఏ వైద్యులతో సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో మెడికల్ జోన్ల ఏర్పాట్లపై సాధ్యాసాధ్యాలు చర్చించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులతో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సమీక్ష నిర్వహించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు, చీఫ్ అర్బన్ ప్లానర్లు, వైద్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రైవేట్ హస్పిటల్స్ క్లినిక్స్ దానవాయిపేట ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పెరగడం, పార్కింగ్ సమస్యలు, అంబులెన్సులు రాకపోకల్లో ఆటంకాలు ఉత్పన్నమౌతునందున వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. నగరానికి సమీపంలో కేంద్రీకృత మెడికల్ జోన్/హెల్త్ సిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు వైద్యులు ఎక్కువ మంది ముందుకు వస్తే త్వరగా నగరానికి సమీపంలో అనువైన స్థలాన్ని గుర్తించి హెల్త్ సిటీగా అభివృద్ధి చేయగలమని కమిషనర్ తెలిపారు. వైద్యులు తమ అభిప్రాయాలు ప్రతిపాదనలు, అవసరాలను ఒక ప్రాజెక్ట్ ప్రపోజల్ రూపంలో సమర్పించాలని సూచించారు. అనంతరం ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ డి.సతీష్, కోశాధికారి దుర్గాప్రసాద్, ఈసీ సభ్యులు డాక్టర్ లలిత, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ కందుల సాయి మాట్లాడుతూ హెల్త్ సిటీ వల్ల నగర అభివృద్ధి, ప్రత్యేక వైద్య మండలిగా మారే అవకాశాలు, మెరుగైన వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలకు వేగవంతమైన అనుసంధానం, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం, కొత్త ఉపాధి అవకాశాలతో నగర ప్రణాళికతో సమతుల్యత ఏర్పడుతుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ జి కోటయ్య, రుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీవీఎస్ ఎన్ మూర్తి, ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు ఇటీవల ప్రమాదంలో మరణించిన తమ ఏ తరగతి సభ్యుడు కోలా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ బ్యాంక్ ఏ తరగతి సభ్యులు మరణిస్తే వారి కుటుంబం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ సొమ్ము తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్లు కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాస్, పిల్లి శ్యామ్‌కుమార్, యర్రమోతు ధర్మరాజు, బుడ్డిగ రవి కొండలరావు, యాళ్ళ వెంకటరావు, ముదిగి శ్రీనివాసరావు, యెనమల రంగారావు, సింగంపల్లి వెంకటరామకృష్ణ, ఎస్ సూర్యసత్యనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వాసు



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మోరంపూడి సమీపంలో వేంచేసియున్న పోలేరమ్మ జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి వెళ్లిన ఆదిరెడ్డి వాసును ఆలయ పెద్దలు ఘనంగా స్వాగతించారు. అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలు ఆయరారోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్‌లోని వీరేశలింగం టౌన్ హాల్‌లో వీరేశలింగం జయంతి సందర్భంగా కళా గౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో పీవీబీ సంజీవరావు అధ్యక్షతన 20 మంది కవుల వ్యాఖ్యానాలతో కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి బీహెచ్ రమాదేవి స్వాగత వచనం పలుకగా, శ్రీపాద సీతామహలక్ష్మి ప్రార్థనాగీతం ఆలాపించారు. బీవీఎస్ మూర్తి వీరేశలింగం జీవిత విశేషాలను సమాజానికి తెలియని అనేక సంఘటనలను తెలియజేశారు. సమాజానికి వీరేశలింగం చేసిన సంఘసేవ, సాహిత్యసేవ, వారి ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మ వెన్నుదన్నుగా ఉంటూ తన భర్తను ఎలా ప్రోత్సహించారో ఇవన్నీ కవులు తమ కవిత్వాల్లో ప్రతిబింబింపజేశారు. సప్పా దుర్గాప్రసాద్, వీవీ సుబ్రహ్మణ్యం, గండిస్వామి ప్రసాద్, మల్లెమొగ్గల గోపాలరావు, జల్లేపల్లి సుబ్రహ్మణ్యం, ఎస్.త్రినాధరావు, జోరాశర్మ, ఓబులేసు వంటి 20 మంది కవులతో ప్రాంగణం కళకళలాడింది. వరాహగిరి కృష్ణమోహన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

నియోజకవర్గానికి విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ, శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ చౌదరి, నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గానికి నాలుగు విద్యుత్ ఉపకేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజానగరం నియోజకవర్గ చరిత్రలో ఒకేసారి నాలుగు రావడం ఇదే మొట్టమొదటిసారి అని ఆయన అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్మించనున్న 33/ 11 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నియోజకవర్గంలో ఏర్పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంతో బాటు నాలుగు పర్యాయాలు అసెంబ్లీలో కూడా చర్చించామన్నారు. దీనితో ప్రభుత్వం మండలంలోని నన్నయ విశ్వవిద్యాలయం కు, ముక్కినాడ, కలవచర్లలోని ఇండస్ట్రియల్ పార్క్ తోబాటు కోరుకొండ మండలం కోటికేశవరంనకు కొత్తగా విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరు చేసిందని తెలిపారు. ముక్కినాడ విద్యుత్ ఉపకేంద్రానికి స్థలసేకరణ జరుపుతున్నామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇండోర్ స్టేడియం పనులను గత ప్రభుత్వ హయాంలో మధ్యలో వదిలేసి వెళ్లిపోయారని అన్నారు. ఆదికవి నన్నయకు ఎంత వైభవం ఉందో , నన్నయ విశ్వవిద్యాలయానికి కుడా అంత వైభవం రాబోయే రోజులలో తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. వీసీ ప్రసన్నశ్రీ పనితీరును అభినందించారు. నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్రానికి అవసరమైన స్థలం కేటాయించి నన్నయ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం అయ్యిందని అన్నారు. కార్యక్రమంలో రాజానగరం బీజేపీ ఇన్‌ఛార్జి నీరుకొండ వీరన్నచౌదరి, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యుత్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, రాజమహేంద్రవరం రూరల్ ఆపరేషన్స్ ఈఈ శ్రీధర్‌వర్మ, ఈఈలు ఎం.రవికుమార్, వై.డేవిడ్, డీఈ సన్యాసిరావు, ఏఈ సుధాకర్, ఎంపీడీవో జేఏ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

క్రీడా పోటీల్లో విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొనాలి

నన్నయ ఉపకులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో విశ్వవిద్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి గురువారం వాలీబాల్, క్యారంబోర్డు పోటీలను వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు ఏవీఎస్ఎస్ మూర్తి, బి.రామ్‌గోపాల్, వీవీఎంయు ఫణీంద్ర. ఎ. సత్యనారాయణ, వీఎస్ దేవానంద్, బాలసత్యనారాయణ సుబ్రహ్మణ్యం, అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించి, తమను విశ్వవిద్యాలయ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.విజయబాబు విజ్ఞప్తి చేశారు. నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశ్వవిద్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే బత్తులను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయం స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు అరకొర జీతాలతో పనిచేస్తున్నామని, ఉద్యోగ భద్రత కల్పించాల్సిందిగా కోరారు.



నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

సీహెచ్‌వోల నిరసన

సీతానగరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతానగరం ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు పలు సమస్యలపై మాట్లాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏటీకె చైతన్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌కె మౌనిక, బి.చంద్రశేఖర్, ఎస్‌కె చాందిని , బి.స్వరూప స్పందన, నేగ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం భూముల బహిరంగ వేలం రద్దు చేయాలి

రాజానగరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ ధర్మాదాయ శాఖ అధీనంలోని రాజానగరంలోని అన్నదాన సత్రానికి చెందిన 25.16 ఎకరాల భూమిలో పంటల సాగు కోసం ఇటీవల నిర్వహించిన బహిరంగ వేలాన్ని రద్దు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్ సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌కు అందజేసిన వినతి పత్రం ప్రతులను గురువారం ఇక్కడి విలేకరులకు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాధరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రం భూమిలో పంటల సాగుకు సంబంధించిన 14న నిర్వహించిన బహిరంగ వేలం వ్యవహారంలో అధికారులు సమాచార లోపంతో రైతులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో కొంతమంది సిండికేట్‌గా మారి తక్కువ ధరకు వేలం పాటను దక్కించుకున్నారన్నారు. దశాబ్దాల కాలంగా సదరు భూములను అక్రమంగా అను భవిస్తూ నామ మాత్రపు లీజు బకాయిలను సక్రమంగా చెల్లించని వారి బంధువులు, స్నేహితులకే అధికారులు మళ్లీ కట్టబెట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు వేలం పాటలను రద్దు చేసి, మళ్లీ బహిరంగ వేలం నిర్వహించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



రంగాపురంలో మెయిన్ పాఠశాలలో చేర్పిస్తామంటూ అంగీకార పత్రం ఇస్తున్న తల్లులు

బిక్కవోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని అందువల్ల తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రంగాపురం టీడీపీ గ్రామ నేత కానాటి అప్పలస్వామి కోరారు. గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం గ్రామంలో ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. హెచ్‌ఎం గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పిల్లల ఇళ్లకు వెళ్లి తమ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. పాఠశాల పరిధిలో ఐదేళ్లు నిండిన పిల్లలు 50 మంది వుండగా పది మంది చేరారని హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు.

బెల్లపు ఊట స్వాధీనం

రంగంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దొడ్డిగుంట గ్రామంలో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించి అదే గ్రామానికి చెందిన టేకుమూడి దుర్గారావు దగ్గర 10 లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సిఐ. సుధ తెలిపారు. బెల్లపుఊటను అక్కడే ధ్వంసం చేశామని తెలిపారు.



విచారణకు హాజరైన సురేష్‌బాబు, ఉపాధ్యాయులు

నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

రంగంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సమాచారం అర్జీలకు నిర్ణీత వ్యవధిలో సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిన పౌరసమాచార అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. వడిశలేరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఏటీ), సూర్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన వివరాలపై సమాచారం ఇవ్వాలని సురేష్‌బాబు దరఖాస్తు చేయగా ఆ పాఠశాలల ఉపాధ్యాయులు (పిఐవోలు) సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని దానిపై మొదటి అప్పీలు ఎంఈవోకు దాఖలు చేశా మన్నారు. ఈ సందర్భంగా అప్పిలేట్ అధికారి విచారణకు పిలిచారని చెప్పారు. దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వకుండా సమయాన్ని వృధా చేసినందుకు చర్యలు తీసుకోవాలని అప్పిలేట్ అధికారులను కోరారు. ఎంఈవో కె.శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టం అప్పిలేట్ అధికారిగా విచారణ జరిపి 30లోగా సమాచారం కాపీలు ఉచితంగా సురేష్‌బాబుకు ఇవ్వాలని పిఐవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు ఉత్తరాంధ్ర రీజియన్ చైర్మన్ కె.కిషోర్, ఎంఈవో- 2 పి.మధుసూధనరావు, పి.ఐ.వోలు పాల్గొన్నారు.

పూజారి ఆక్రమించిన స్థలం స్వాధీనం



రామవరంలో శివాలయం భూమిలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

అనపర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామంలోనున్న శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దేవదాయ శాఖ నుంచి నిధులను మంజూరు చేయించి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆలయ పూజారి బి.శ్రీనివాసశర్మ ఆలయ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేశారు. నూతన ఆలయ నిర్మాణానికి స్థలం సరిపోకపోవడంతో కమిటీ ప్రతినిధులు కొంత స్థలం ఇవ్వాలని పూజారిని కోరారు. వారి విజ్ఞప్తిని తిరస్కరిస్తూ ఆ స్థలం తనదేనంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఆయా శాఖల అధికారులు ఆలయానికి చెందిన భూమికి సర్వే నిర్వహించి దేవాలయ భూమిని ఆక్రమించినట్లు ధ్రువీకరించారు. దీంతో గురువారం అనపర్తి తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎమ్‌పీడీవో రామకృష్ణారెడ్డి, దేవదాయశాఖ అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తంటికొండ వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

గోకవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ పుట్టినరోజును గురువారం గోకవరంలో ఆపార్టీ నాయకులు ఘనంగా జరిపారు. తంటికొండ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు గళ్ళా రాము, నాగం వెంకటపతి తదితరులు స్వామివారికి పూజలు చేశారు. గోకవరంలోని బత్తుల సత్తిబాబు అనాధశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు నాయకులు గాజింగం సత్తిబాబు, ఉంగరాల రాము, రాయవరపు శ్రీనివాస్, పోసిన ప్రసాద్ తదితరులు పండ్లు, రొట్టెలు అందజేశారు.



తంటికొండ వెంకన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం


గోకవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పంచాయితీ కార్యదర్శి చెదల చిన్నకుమార్ రెడ్డి(54) అనారోగ్యంతో రాత్రి మృతి చెందారు. ఈయన సుమారు 25 ఏళ్లగా కార్యదర్శిగా బాధ్యతులు నిర్వహిస్తున్నారు. కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నాయకులు అడపా భరత్, కన్నబాబు, జనపరెడ్డి సుబ్బారావు, పాలూరి బోస్ తదితరులు సంతాపం తెలిపారు.

అమ్మవారికి ఎమ్మెల్యే నల్లమిల్లి పూజలు

అనపర్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దుప్పలపూడి గ్రామ దేవత దోర్లాంబిక అమ్మవారి తీర్థం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారు నగలతో అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. అనపర్తి, పీరా రామచంద్రపురం గ్రామాల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, ఎన్‌వీ. లక్ష్మి, చిర్ల గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 24.0



ఏమి హాయిలే ఇలా...

36..40..42..45..ఎంత ఉష్ణోగ్రత వచ్చినా మాకేం భయంలేదు.. భానుడు ఎంత ప్రతాపం చూపితే మాకు అంత ఆనందం అంటున్నారు గోదావరి పరీవాహక ప్రాంతం జనం.. వేసవి ఆరంభం నుంచి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒక్కటే సందడి..గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూడా అలాగే ఉంది. జనంతో నిండిపోయింది. భానుడు ఉష్ణోగ్రత పెంచుతుంటే జనం కూడా అదే స్థాయిలో గోదారమ్మ చెంతకు చేరి ఇలా సేదతీరుతున్నారు..కుటుంబంతో కలిసి గోదావరిలో స్నానాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు.. గోదారమ్మ ఒడిలో పెద్దలైనా చిన్న పిల్లల్లా మారిపోతున్నారు. నీటిలో మునుగుతూ తేలుతూ ఒళ్లంత..తుళ్లింత కావాలిలే అంటూ ఆటలాడుతున్నారు. మహిళలు కూడా తరలివచ్చి స్నానాలు చేస్తున్నారు.. అయితే ఆనందంలో ఆదమరుపుగా ఉండొద్దు.. ఎటు నుంచి ఎటువంటి ప్రమాదం వస్తుందో చెప్పలేం.. తస్మాత్ జాగ్రత్త.. ఇరిగేషన్ అధికారులు సందర్శకులపై దృష్టి సారించాల్సి ఉంది.. గోదావరి ప్రమాదాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాల్సి ఉంది. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



ఆటవిడుపు

ఉప్పొంగిలే గోదావరి : గోదావరిలో సేదతీరుతున్న జనం

గురుకులాలు.. గాలికే!



కోట్లు ఊడ్చేసి.. కాంట్రాక్టు కంపెనీ కక్కుర్తి పనులు

సమస్యల మధ్యే చదువు సా..గుతోంది.. అయినా అటువైపు కన్నెత్తి చూసేవారే లేరు.. కనీసం పట్టించుకునేవారు కానరావడంలేదు.. నిధులు ఏమైనా లేవా అంటే అదీ కాదు.. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారిపోయింది.. కోట్లు తీసుకున్నా.. కక్కుర్తి పనులు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.. ఇదీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 21 అంబేడ్కర్ గురుకుల వసతి గృహాల్లో దుస్థితి.. కలుషిత నీళ్లు తాగుతూ.. అపరిశుభ్ర వాతావరణం మధ్య వేలాది మంది విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాంట్రాక్టు శానిటేషన్ కంపెనీ నిధులు మింగేసి నిర్వహణ గాలికొదిలేయడంతో సమస్యల మధ్యే చదువు సాగిస్తున్నారు. ప్రిన్సిపాళ్లు సైతం సదరు కంపెనీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తీరు మార్చుకోవడం లేదు.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కోట్లాది రూపాయల మేర నిధులిస్తున్నారు.. చుట్టూ పెద్దఎత్తున అధికార యంత్రాంగం ఉంది. అయితే ఏం లాభం.. కనీసం అక్కడ ఏం జరుగుతుందో చూసే వారే కరువయ్యారు. విద్యార్థులు సమస్యల మధ్యే వసతి పొందుతున్నా పరిష్కరించే నాథులే కరువయ్యారు. ఇదెక్కడో కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో దుస్థితి. ఆ వసతి గృహాల్లో మంచినీటి ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన కాంట్రాక్టర్ గాలి కొదిలేయడంతో విద్యార్థులకు కలుషిత నీరే దిక్కుగా మారింది. అటు వందల సంఖ్యలో ఉండే విద్యార్థుల హాస్టళ్లలో ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయాల్సి ఉన్నా అదీ చేయడం లేదు. డ్రైనేజీ నిర్వహణ పట్టించు కోవడం లేదు. హాస్టల్ పరిసరాలను గాలికొదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో టెండరు దక్కించుకున్న తెలంగాణకు చెందిన ఈ కంపెనీ ప్రభుత్వం మారినా అదే అరాచకం కొనసాగిస్తోంది. అటు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి లేఖలు రాసినా కాంట్రాక్టర్ ఖాతరు ఏమాత్రం చేయడం లేదు. సదరు బిల్లులు భారీగా బొక్కేస్తూ స్థానికంగా ఓ ఇద్దరు తాత్కాలిక ప్రైవేటు ఉద్యోగులకు హాస్టళ్లను సబ్ కాంట్రాక్టుకు ఇచ్చేసి తన బాధ్యతను వదిలేశాడు.

నలుగురు ఎమ్మెల్యేలు చెప్పినా..

ఉమ్మడి జిల్లాలో అంబేద్కర్ గురుకుల వసతిగృహాల్లో శానిటేషన్ కంపెనీ నిర్లక్ష్యంపై ఆయా ప్రిన్సిపాళ్లు ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం మారినా కంపెనీ వైఖరి ఏమాత్రం మారలేదని నివేదికలో వివరించారు. మొత్తం 15 అంశాల్లో కంపెనీ కనీసం ఆరు అంశాల్లో కూడా పారిశుధ్య నిర్వహణ పాటించడం లేదని రిమార్కులతో నివేదికలు పంపారు. వీటిని పరిశీలించి సరిదిద్దాల్సిన జిల్లా కోఆర్డినేటర్ సైతం కంపెనీపై చర్యలు తీసుకునేలా పైఅధికారులకు సిఫార్సులు చేయలేదు. మరోపక్క ఈ వసతి గృహాల్లో శానిటేషన్ ఘోరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కొంతకాలం కిందట స్థానిక ఎమ్మెల్యేలకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి నేరుగా లేఖలో ఫిర్యాదు చేశారు. అయినా కంపెనీ మాత్రం తన తీరు మార్చుకోలేదు.

13 వేల మంది విద్యార్థులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 21 చోట్ల అంబేడ్కర్ గురుకుల వసతి గృహాలు ఉన్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎస్సీ విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు వసతి అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఒక్కో వసతి గృహంలో 640 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 13 వేల మంది ఉంటున్నారు. గురుకులాల్లో పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చదువు,వసతి ఉండేలా ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోంది. పారిశుధ్య నిర్వహణకు కాంట్రాక్టర్‌ను నియమించి నెలకు కోట్లలో బిల్లులు చెల్లిస్తోంది. శానిటేషన్ కాంట్రాక్టు పొందిన కంపెనీ ప్రతి వసతి గృహానికి సిబ్బందిని నియమించి యూనిఫాం ఇచ్చి పనులు చేయించాలి. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు అనుకూలంగా ఉండడంతో ఎక్కడికక్కడ స్థానికంగా ఓ మనిషిని పురమాయించి వారితో అరకొర పనులు చేయిస్తూ నెట్టుకొచ్చింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా సదరు కంపెనీ అదే నిర్లక్ష్యం కొనసాగిస్తోంది. వసతి గృహం ఉన్న ప్రాంతంలో ఓ పనిమనిషికి రూ.5 వేల వరకు ఇచ్చి తూతూమంత్రంగా పనులు చేయిస్తోంది. కంపెనీ కోట్లలో దండుకుంటోంది.

విద్యార్థులకు కలుషిత నీరే తాగునీరు..

ఉమ్మడి జిల్లాలో 21 వసతిగృహాల శానిటేషన్ కాంట్రాక్టును గత వైసీపీ ప్రభుత్వం తన అనుకూలంగా ఉండే తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 2023లో ఇచ్చింది. సదరు కంపెనీ కొద్దినెలలు మినహా ఆ తర్వాత పారిశుధ్య నిర్వహణ గాలికొదిలేసింది. నిబంధనల ప్రకారం ఈ కంపెనీ ఆయా హాస్టళ్లలో సిబ్బందిని నియమించుకుని పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. మూడు నెలలకోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేసి మంచినీరందించాలి. అయితే ఏడాదిన్నరగా పూర్తిగా గాలికొదిలేసింది. హాస్టళ్లలో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. దీంతో విద్యార్థులు కలుషిత నీటినే తాగుతున్నారు. కొన్నిచోట్ల ఇవి పాడైపోవడంతో బోరు నీరు తాగాల్సిన పరిస్థితి. వేలాది మంది విద్యార్థులు ఉండే హాస్టళ్లలో సెప్టిక్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయించాలి.కానీ ఏడాదిన్నరగా పట్టించుకోవడం మానేసింది. దీంతో విద్యార్థులు దుర్వాసన మధ్యే వసతి పొందాల్సి వస్తోంది. హాస్టళ్లలో డ్రైనేజీ, ఇతర కాలువల్లో వ్యర్థాలు, ఇతర ఆహారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా సదరు కంపెనీ పట్టించుకోవడం లేదు. హాస్టళ్లన్నీ అపరిశుభ్ర వాతావరణంలో ఉంటున్నాయి. కానీ నెలనెలా మాత్రం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల బిల్లులు దండేసుకుంటోంది.

- అంబేడ్కర్ గురుకులాల్లో ఘోరం
- శానిటేషన్ నిర్వహణ గాలికి
- అపరిశుభ్రంగా హాస్టళ్లు
- గత వైసీపీలో కాంట్రాక్టు
- నలుగురు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- వసతిగృహాల ప్రిన్సిపాళ్ల నివేదికలు
- ఖాతరు చేయని కాంట్రాక్టు కంపెనీ
- మళ్లీ కాంట్రాక్టు పొడిగింపుపై కన్ను



గతేడాదే గడువు ముగిసినా..

గతేడాదే ఈ కంపెనీకి టెండరు గడువు పూర్తయింది. కానీ గత వైసీపీ పెద్దలు మాత్రం పనితీరు ఏమాత్రం బాగోలేని కంపెనీకి దాసోహమయ్యారు. తిరిగి మరో ఏడాది కాంట్రాక్టు పొడిగిస్తూ గతేడాది అడ్డగోలుగా నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా ఇప్పటికీ ఈ సంస్థ సేవలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. అధికారులు సైతం రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో కంపెనీ నిర్లక్ష్యపు సేవలపై కనీసం సమీక్షించలేదు. మరోపక్క గురుకుల వసతి గృహాల్లో అప్పనంగా కోట్లలో డబ్బు బిల్లులు రూపంలో వస్తుండడంతో త్వరలో ముగిసిపోనున్న కాంట్రాక్టును మళ్లీ పొడిగించేందుకు సదరు కంపెనీ రాజకీయంగా పావులు కదుపుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచినా మళ్లీ తామే కొనసాగేలా తెరవెనుక మంత్రాంగం నడుపుతోంది.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



ఊనగట్లలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి,ఆర్‌డీవో

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద గురువారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు,ఉచిత ఇసుక పాలసీ, రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఇసుక నిల్వలు, పీఎం కుసుమ్ పోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటు, భూ సంబంధ అంశాలు, ఎంఎస్ఎంఈ సర్వే, ఇండస్ట్రీయల్ పార్క్, స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై ఆరా తీసినట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉండే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ కే.తిలక్ కుమార్,డీపీవో వి.శాంతమణి,సివిల్ సప్లయిస్ డీఎం టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి..

చాగల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలో జిల్లా కలెక్టర్ గురువారం విస్తృత తనిఖీలు చేశారు.ఊనగట్లలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, బ్రాహ్మణగూడెంలో రీసర్వే జరుగుతున్న తీరు పరిశీలించి రైతులతోను మాటాడారు. సచివాలయం సందర్శించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన సేవలందించాలని సూచించారు. రీసర్వే జరిగే సమయంలో రైతులు స్వయంగా పాల్గొని అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. మన మిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత,జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, ఇమ్యూనైజేషన్ అధికారి పి.కోమల, తహశీల్దార్ ఎం.మెరికమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మూడో శనివారం 4వ విడత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ థీమ్‌తో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరమ్మతుల కొచ్చిన కంప్యూటర్లు,ప్రింటర్లు, స్కానర్లు తీసేసి, ఆఫీ సులను శుభ్రంగా ఉంచాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కియోస్క్ స్టాల్స్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఒక చోటకు చేర్చాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రజల నుంచి ఈ-వేస్ట్ సేకరించాలని చెప్పారు.ప్రతి గ్రామంలో టాంటాం వేసి, ప్రజలకు అవగా హన కల్పించాలన్నారు

ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య బదిలీ



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) రాజమండ్రి పోస్ట్ కమాం డర్ సైదయ్య హైదరాబాద్‌లోని ఆర్పీఎఫ్ క్రైం ఇంటెలిజెన్స్ బ్యూరోకి బదిలీఅయ్యారు. 2021లో ఇక్కడికి వచ్చిన సైదయ్య సమర్థవంత మైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.గరీబ్‌రథ్‌లో చోరీకి గురైన కిలోన్నర బంగారం, కిడ్నాప్‌కు గురైన 1.5ఏళ్ల చిన్నారి వంటి కేసులను ఛేదించారు. భద్రతపై ప్రయాణికులకు తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. సైదయ్య స్థానంలో హైదరాబాద్ నుంచి బి.రాజు వస్తున్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అందించే అత్యున్నత పద్మ పురస్కారాల (పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ) కోసం క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. 2026వ సంవత్సరానికి అంతర్జాతీయ క్రీడల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యున్నత ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



మూగజీవాల రోధన

పశువుల ఆసుపత్రుల్లో వైద్యులు లేక ఇక్కట్లు

- మురమండలో దారుణం
- 20 పశువులు మృత్యువాత
- పశు వైద్యులను నియమించాలి

కడియం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాల రోదన ఎవరికి పడుతుంది.. సమస్య ఉన్నా పట్టదు.. తెలిసినా పట్టించుకోరు..మూగజీవాలు మాత్రం ప్రాణాలతో పోరాడుతున్నాయి. వ్యవసాయాధారిత జిల్లా కావడంతో ప్రతి ఇంటా పాడిపంట కామన్.. అయితే జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో పశు వైద్యులు లేక రైతాంగం కొట్టుమిట్టాడుతున్నారు. పశువులైతే రోగాలకు తాళలేక మౌనంగా రోదిస్తున్నాయి. ఉదాహరణకు పాడిపరిశ్రమకు అధికంగా ఉండే మురమండ గ్రామంలో ప్రభుత్వ పశువైద్యశాలకు శాశ్వత పశువైద్యాధికారి లేరు.దీంతో గ్రామంలో పాడిరైతులు ఏలేటి శ్రీనివాస్‌కు చెందిన ఆవు, ఈదల శ్రీనివాస్‌కు చెందిన గేదె, పాడి రైతులు పుట్టా నారాయణరావు, పిల్లా అన్నవరం, సుంకర రాజుకు చెందిన పాడిదూడలు ఇలా సుమారు 20 పశువులు మృత్యువాత పడ్డాయి. ముర మండతో పాటు మాధవరాయుడుపాలెం,దుళ్ళ, గ్రామ శివారుల్లో మురమండ గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో పాడిపెంపకం చేసే రైతులు పశువులను వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తీసుకొస్తారు. పశువులకు ఏదైనా సుస్తీ చేస్తే కొంత కాలంగా జేగురుపాడు పశువైద్యులు వచ్చి వైద్యసేవలందిస్తున్నారన్నారు.అటు జేగురుపాడు..ఇటు మురమండ వచ్చి పశువులకు వైద్యం అందించంతో సేవలు ఆలస్యమవుతున్నాయి.శాశ్వత వైద్యుడిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

పశువైద్యుడు లేక ఇబ్బంది..



కొంత కాలంగా మురమండ పశువుల ఆస్పత్రికి వైద్యుడు లేరు. గతంలో పశువైద్యులు, మరో ఇద్దరు సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం కేవలం ఒక వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నారు. జేగురుపాడు పశువైద్యుడే సేవలందిస్తు న్నారు. వెంటనే పశువైద్యుడిని నియమించాలి. **- మరిడి సత్యనారాయణ, రాష్ట్ర ఉత్తమ పాడిరైతు, మురమండ**



సైకిల్.. సారథులు..

60 మంది ఓటర్లకు ఒక సారథి

- టీడీపీలో సంస్థాగత సందడి
- కుటుంబ సారథుల నియామకం
- ఎల్లుండి వరకూ అవకాశం
- ఐదు నియోజకవర్గాల్లో జోరు
- రెండు చోట్ల వెనుకబాటు
- మే 15 వరకూ కమిటీల ఏర్పాటు
- షెడ్యూల్ ప్రకటించిన టీడీపీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికార తెలుగుదేశం ప్రభుత్వంలో సంస్థాగత సందడి మొదలైంది. కుటుంబ సాధికారి సారథుల పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. మే 15వ తేదీలోపు బూత్, గ్రామ కమిటీల నుంచి పార్లమెంట్, దాని అనుబంధ కమిటీల నియామకం పూర్తి చేసే లక్ష్యంతో పార్టీ ఇటీవల షెడ్యూల్ ప్రకటించింది. అన్ని నియోజకవర్గాల, పార్లమెంట్ సంస్థాగత ఎన్నికల్లో నేతలందరినీ సమన్వయపరచి సమర్థవంతంగా కమిటీలు పూర్తిచేయాలని అధిష్ఠానం ఆదేశించింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

వెనుబడిన నిడదవోలు, అనపర్తి

కుటుంబ సాధికార సారథి ఎన్నికలు ఈ నెల 14వ తేదీన ఆరంభం కాగా.. ఐదు నియోజకవర్గాల్లో ముందుండగా రెండు నియోజకవర్గాలు మాత్రం వెనుకబడ్డాయి. నిడ దవోలు, అనపర్తి నియోజకవర్గాలు వెనుకబడ్డా యి.ఈ మేరకు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అధిష్ఠానానికి సంస్థా గత ఎన్నికల కుటుంబ సాధికార సారథులు(కెఎస్ఎస్) రిపోర్టు ఇచ్చారు.

- గోపాలపురం నియోజకవర్గంలో 80.86 శాతం నియామకాలు పూర్తయ్యాయి.మొత్తం 4044 కుటుంబ సాధికార సారథులు (కెఎస్ఎస్) ఉన్నారు. ఒక్కో కెఎస్ఎస్‌లో ఇద్దరు సభ్యులు అంటే మొత్తం 8088 మంది ఉంటారు.ఇప్పటికే 6540 మందిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో నియ మించారు. ఇది మొదటి స్థానంలో నిలిచింది.
- రెండో స్థానంలో రాజమహేంద్రవరం సిటీ ఉంది. ఇక్కడ 4237 కెఎస్ఎస్‌లు, 8474 మంది కెఎస్ఎస్ సభ్యులు ఉంటారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నాయకత్వం లో 5615 మంది నియామకాలు పూర్తి చేశారు.
- మూడో స్థానంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఉంది.అక్కడ 4481 కెఎస్ఎస్‌లు ఉండగా 8962 మంది సభ్యులు ఉంటారు. ఇప్పటి వరకూ 4184 మందిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నియమించారు.
- కొవ్వూరు 4వ స్థానంలో ఉంది. కెఎస్ఎస్‌లు 3060 మంది ఉన్నారు.6120 మంది సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 2513 మందిని నియమించారు.
- రాజానగరం ఐదో స్థానంలో ఉంది.ఇక్కడ పార్టీ ఇన్‌చార్జిగా రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఉన్నారు. మొత్తం 3599 మంది కెఎస్ఎస్‌లు ఉండగా అందులో 7198 మంది సభ్యులు ఉంటారు. ఇంత వరకూ 2794 మంది సభ్యులను నియమించారు.
- అనపర్తిలో టీడీపీ ఎమ్మెల్యే లేని పరిస్థితి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.కూటమిలో భాగంగా బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయినా తెలుగుదేశం కమిటీల నియామకంలో వెనుకబడింది.ఇక్కడ మొత్తం 3767 మంది కెఎస్ఎస్‌లు ఉండాలి. 7534 మంది సభ్యులు ఉండాలి. ఇంత వరకూ కేవలం 66 మంది నియామకం మాత్రమే పూర్తయింది. ఇది కేవలం 0.88 శాతం మాత్రమే.
- నిడదవోలు పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే లేరు. కూటమి తరపున జనసేన ఎమ్మెల్యేగా మంత్రి కందుల దుర్గేష్ ఉన్నారు. టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఉన్నారు. ఇక్కడ కెఎస్ఎస్‌ల నియామకం బాగా వెనకబడి ఉంది. మొత్తం 3542 మంది కెఎస్ఎస్‌లు..7084 మంది సభ్యులు ఉంటారు.ఇప్పటి వరకూ కేవలం 12 మంది సభ్యుల నియామకం మాత్రమే పూర్తయింది. ఇది కేవలం 0.17 శాతం మాత్రమే. టీడీపీకి ప్రతిచోట కేడర్ బలంగా ఉండడం వల్ల అక్కడక్కడా సమస్యలు ఉన్నా పరిష్కారమవుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



సంస్థాగత షెడ్యూల్ ఇలా..

టీడీపీ సంస్థాగత ఎన్నికల షెడ్యూల్‌ను అధిష్ఠానం ప్రకటించింది.ఈ నెల 14 నుంచి కుటుంబ సాధికారిత సారథుల నియామకం ఆరంభమైంది.60 మంది ఓటర్లకు ఓ కుటుంబ సాధికార సారథి (కెఎస్ఎస్)ఉంటారు. ఇందులో ఇద్దరు సభ్యులు మహిళ, పురుషుడు ఉంటారు.ఈ నెల 20వ తేదీలోపు కుటుంబ సాధికార సారథులను నియమించాలి. 22వ తేదీలోపు బూత్,గ్రామ కమిటీలు నియమించాలి. 23 నుంచి 30వ తేదీ లోపు క్లస్టర్, యూనిట్, మండల, పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీల నియామకం పూర్తి కావాలి.మే నెల 1 నుంచి 7 వరకూ నియోజకవర్గాల అనుబంధ కమిటీల నియా మకం జరగాలి.మే 8 నుంచి 15 వరకూ పార్లమెంట్, అనుబంధ కమిటీలు నియమించాలి.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కొవ్వూరులోని నారాయణ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. బహుళ అంతస్థుల భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అందులో చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాలను చేసి చూపించారు. గ్యాస్ సిలిండర్ లీకైనపుడు ఏ విధంగా అదుపుచేయాలో వివరించారు. అగ్ని ప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు అగ్నిమాపకశాఖ ఎలా నివారిస్తుందో మాక్ డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎస్.సీతారామయ్య, ఎన్వై రామకృష్ణ, కె.ధనుంజయరావు, కె.ధనుంజయరావు, సీహెచ్‌వీవీ గంగాధరరావు, ఎం.ప్రకాష్‌బాబు, కె.ధనేష్, జీసీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

కూటమి బలోపేతానికి సమష్టి కృషి

జనసేన నాయకులు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

నిడదవోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి బలోపేతానికి సమష్టిగా పని చేస్తున్నామని జనసేన నాయకులు అన్నారు. గురువారం నిడదవోలులో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ జనసేనలు కలసి ఏర్పాటు చేసుకున్న కూటమి ప్రభుత్వంలో తామంతా కలసి ఉన్నామని ప్రజలతో కలసి ఉండాలన్నదే వారి అభిమతమని అన్నారు. కొన్ని పత్రికల్లో కూటమిలో కలకలం అంటూ వచ్చిన కథనాలపై వారు స్పష్టత ఇచ్చారు. కొంత అసంతృప్తి ఉండడం సహజమే నని, అంతమాత్రాన చిచ్చు రేగిందనడం హాస్యాస్పదమన్నారు. కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా రాష్ట్రనియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. మూడు భిన్న రాజకీయ కోణాలున్న పార్టీలు ఒకే వేదికపై పనిచేస్తున్నప్పుడు సమన్వయం పాటించడం, న్యాయం గా పదవులను పంపిణీ చేయడం చాలా సవాళ్లతో కూడుకున్నదని, అయినా మంత్రి దుర్గేష్ చూపుతున్న వ్యూహాత్మక దృష్టి కోణం, సమన్వయం సర్దుబాటు చేయగల సామర్థ్యం ప్రశంసనీయమన్నారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యుడు పాలా వీరాస్వామి, పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, అబ్దుల్ షబ్బీర్, కొవ్వాడ బాలు బాలాజీ, నగిడిబోయిన నాగరాజు, అచ్యుత పవన్ పాల్గొన్నారు.

ఫొటోస్టూడియోలో చోరీ

రూ.1,80,000 విలువైన కెమెరాలు అపహరణ


స్టూడియో తాళాలు పగలగొడుతున్న దుండగులు(సీసీ ఫుటేజీ)

దేవరపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని కురేటి రామకృష్ణ ఆర్కే డిజిటల్ ఫొటో స్టూడియోలో గురువారం తెల్లవారుజామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక స్టేట్‌బ్యాంకు పక్కన ఉన్న ఆర్కే స్టూడియోలో తెల్లవారుజామున 2.30కు కారులో వచ్చిన దుండగులు ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు పెట్టుకుని రాడ్లు తీసుకుని పగలగొట్టి స్టూడియోలో ప్రవేశించారు. లోపల ఉన్న విలువైన మూడు కెమెరాలు, ఒక హెచ్‌పీ ల్యాప్‌ట్యాప్, రెండు హార్డ్ డిస్క్‌లు దొంగలించిపోయారు. వాటి విలువ సుమారు రూ.1,80,000 విలువ ఉంటుందని యజమాని రామకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి వేలిముద్ర నిపుణులు వచ్చి స్టూడియోను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. స్టూడియో యజమాని రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. చోరీ ఘటనకు సంబంధించి సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించినట్టు ఆయన పేర్కొన్నారు.

దొమ్మేరులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న అచ్చిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్యాన్ని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. మండలంలోని దొమ్మేరులో గురువారం ఆరుగురికి రూ.7,83,890 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, యలమర్తి శ్రీరాంప్రసాద్, కలగర సుబ్బారావు, గారపాటి శ్రీదేవి, కేవీకే రంగారావు, జి.రామకృష్ణ, వాడవెల్లి రామచంద్రరావు పాల్గొన్నారు.

హరిబాబుకు పరామర్శ

చాగల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఏఎంసీ మాజీ ౘైర్మన్ ఆళ్ల హరిబాబును టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు పరామర్శించారు. గురువారం హరిబాబు పుట్టినరోజు కావడంతో ఆయనతో కేక్ కటింగ్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ౘైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, టీడీపీ నాయకులు నందిగం శ్రీను, తాళ్ళూరి ప్రసాద్, దొంగ రామకృష్ణ, ఈడుపుగంటి మురళి, ఈడుపుగంటి సుబ్బారావు, నాగేశ్వరరావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, పాశం రామకృష్ణ, దొంగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో పంటగా సజ్జ సాగుతో మేలు

ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహరావు


వాదాలకుంటలో రైతులను సన్మానిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మూడో పంటగా రైతులు సజ్జ పంటను సాగుచేస్తే నాణ్యమైన, పోషక విలువలున్న చిరుధాన్యపు పంటను ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా విలువ అధారిత ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి కలుగుతుందని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. కొవ్వూరు మండలం పశివేదలలో గురువారం రైతులకు చిరుధాన్యాల పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణను అందజేశారు. నరసింహారావు మాట్లాడుతూ దాళ్వా పంటల తరువాత రాగి, కొర్రలు సాగు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. పెట్టుబడి వ్యయం తక్కువని, చీడపీడల తాకిడి తక్కువగా ఉంటుందన్నారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తక్కువ తడులతో, ఎరువులతో ఆరోగ్యకరమైన పంటను తీసుకోవచ్చునన్నారు. తొలిదశలో కలుపు నివారణ, సమతుల్యమైన ఎరువులను వాడుతూ, 70 నుంచి 85 రోజుల్లో వేసవి పంటగా పండిస్తే ఎకరాకు రూ.20 వేలు అదనంగా పొందవచ్చునన్నారు. వేసవి అపరాల కంటే లాభదాయకమన్నారు. వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ మాట్లాడుతూ ఈ ఏడాది కొంత విస్తీర్ణం చిరుధాన్యాల సాగుకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

గోపాలపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) నవధాన్యాల సాగులో ప్రత్యేక ఆసక్తి కనబరిచిన రైతులు జొన్నలగడ్డ రాంబాబు, వై.కొండ్రావు, కె.మార్క్‌కు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో వాదాలకుంట సర్పంచ్ మణెమ్మ గురువారం సన్మానించారు. కార్యక్రమంలో రైతు జి.జోగేంద్రప్రసాద్, సిబ్బంది ఎం.అరుణ, శేషగిరి పాల్గొన్నారు.

కూటమితోనే దళితుల అభివృద్ధి

- ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి
- ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఆమోదంపై దళిత నాయకుల హర్షం


కొవ్వూరులో హర్షం తెలుపుతున్న టీడీపీ దళిత నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి కూటమితోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశారని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు తెలిపారు. వర్గీకరణ ఆర్డినెన్స్‌ను మంత్రి మండలి ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం దళిత నాయకుల సమావేశం నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు మాట్లాడుతూ ఇది సువర్ణాక్షరాలతో రాయదగిన విషయమన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకులు వరిగేటి కాంతరాజు, తిగిరిపల్లి కనకరత్నం, కొక్కిరిపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీటీసీ కూనపాము ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని నారా చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే.. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అమలు చేసి వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. గతంలో రాజీవ్‌రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేంద్రంతో చర్చించి 200పాయింట్ల రోస్టర్ అమ లుకు నిర్ణయం తీసుకోవడం దళితుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడమేనన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమలులోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఎస్సీవర్గీకరణ లక్ష్య సాధనకు కేంద్రం తరపున సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి సహకరించిన ప్రధాని మోదీ రాష్ట్రంలో ఆర్డినెన్స్ రావడానికి అహర్నిశలు పనిచేసిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తానేటి వీరరాఘవులు, కొడవటి గంగయ్య, కొడమంచిలి శ్యామ్, వేములూరి రవి, మల్లిపూడి సుబ్బారావు, బాలాజీ, రవి, భాస్కర్, రవి, ఎం.వెంకట్రావు తదితర నాయకులు పాల్గొన్నారు.


గోపాలపురంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించండి

పలుచోట్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా


సమిశ్రగూడెంలో నిరసన ప్రదర్శన చేస్తున్న సీహెచ్‌వోలు

నిడదవోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌వో)గా విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీహెచ్‌వో యూనియన్ ప్రతినిధి పి.సతీష్ అన్నారు. గురువారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌వోలు శాంతియుత నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రెగ్యులర్ కాని వారిని తక్షణం రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.స్వరూప, ఎస్.ప్రియాంక, సీహెచ్ హరిత, కె.జ్యోత్స్న, యు.వెంకటలక్ష్మి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఆరేళ్లుగా గ్రామ స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈపీఎఫ్‌ను గత సంవత్సరం నుంచి నిలిపివేసారని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల అద్దెలు కూడా తామే చెల్లిస్తున్నామన్నారు. మహిళా ఉద్యోగులకు రక్షణ ఉండడం లేదని, హెల్త్ క్లినిక్‌లకు వచ్చే మందుల రవాణా చార్జీలు కూడా భరిస్తున్నామన్నారు. ప్రభుత్వం పునరాలోచించి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుసుమ, నవీన్, రమాదేవి, అరుణ, కృష్ణవేణి, స్వరూప, సౌజన్య పాల్గొన్నారు.


అన్నదేవరపేటలో ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలు

బాణసంచా గొడౌన్‌లో పేలుడు

- పంగిడిలో ఘటన
- తప్పిన ప్రాణాపాయం
- ప్రమాదంలో ధ్వంసమైన గొడౌన్
- రూ.3 లక్షల ఆస్తి నష్టం
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి


ప్రమాదంలో ధ్వంసమైన బాణసంచా గొడౌన్

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలోని బాణసంచా గొడౌన్‌లో పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు. గొడౌన్‌లో బాణసంచా తయారు చేసేందుకు సూర్యకారం, గంధకం, బొగ్గు నిలువచేసి ఉంచారు. అలాగే 150 జువ్వలు, 50 ఔట్లు, 4000 టపాకాయలు, సుమారు 15 కిలోలు తయారు చేసినవి, రా మెటీరియల్ 15 కిలోలు మొత్తం 30 కేజీల ఫైర్ మెటీరియల్ గొడౌన్‌లో ఉన్నాయి. ఒకవైపు ఎండ వేడిమి, మరో వైపు గొడౌన్ తలుపులు మూసేసి ఉండడంతో ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

కొవ్వూరు మండలం ఐ.పంగిడి, చాగల్లు మండలం మీనానగరం గ్రామాల మధ్యలో ఉన్న నఫీజ్ బాణసంచా గొడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచా తయారీ యూనిట్‌లను పరిశీలించి తగిన భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బాణసంచా తయారీదారులు లైసెన్సుల కాలపరిమితి ముగిసిన వారిని గుర్తించి రెన్యూవల్ అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా భద్రపరిచే గొడౌన్‌ల వద్ద తగిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పంగిడిలో నఫీఫ్ ఫైర్ క్రాకర్స్‌కు ఇచ్చిన అనుమతి మార్చి 31వ తేదీతో ముగిసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా బాణసంచా భద్రపరిచే గొడౌన్‌లని పోలీసు, రెవెన్యూ, ఫైర్, స్థానిక సంస్థల అధికారుల బృందం పర్యవేక్షించి లైసెన్సులు లేకపోయినా, తగిన భద్రతా ప్రమాణాలు పాటించక పోయిన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌ఎఫ్‌వో ఈ.స్వామి, డీఎఫ్‌వో మార్టిన్ లూదర్‌కింగ్, ఆర్డీవో రాణి సుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు, ఫైర్ అధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు, ఎస్ఐ కె.శ్రీహరిరావు ఉన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆవ ప్రాంతం నుంచి ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, అక్కినేని వనజ తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాల కోసం ఎనిమిది నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా సమితి నాయకత్వంలో ఇంటి స్థలం కోసం పేదల గోడు పేరుతో రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల కోసం వచ్చిన వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంచాలన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోందని, ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు ఆవ ప్రాంతం నుంచి ప్రదర్శనగా ఇళ్లస్థలాల అర్జీదారులతో కలసి ఆధునిక మేకల కబేళా పక్కనున్న ప్రభుత్వ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఎర్రజెండా పాతి కొబ్బరికాయ కొట్టి ఈ స్థలాన్ని పేదలకు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జట్లు సంఘం అధ్యక్షుడు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సప్పరమణ, లావణ్య, ఇతర నాయకులు, ఆవ, పరిసర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదాయ వ్యయాలు జవాబుదారితనంతో నిర్వహించాలి

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వ్యయ నిర్వహణలో జవాబుదారితనంతో వ్యవహరించినప్పుడే ప్రజల సొమ్ముకు భరోసా ఉంటుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. చిత్తూరులో గురువారం జరిగిన అసెంబ్లీ అంచనాల కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆలయానికి సంబంధించి 2019-24 సంవత్సరాల మధ్య కాలంలో ఆదాయ, వ్యయాలకు సంబంధించిన రికార్డులు కమిటీ సభ్యులు పరిశీలించినట్టు తెలిపారు. వ్యయానికి సంబంధించిన రికార్డుల పరిశీలనలో కొన్నింటిని పరిశీలించగా తేడాలున్నట్టు కమిటీ సభ్యులు గమనించారన్నారు. అటువంటి రికార్డులను కమిటీకి అందజేయాలని సూచించామ న్నారు. 2019-24 కాలంలో నిధుల విడుదల, ఖర్చులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.


చిత్తూరు కలెక్టరేట్‌లో అసెంబ్లీ అంచనాల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

ప్రకృతి విపత్తులపై అధికారులకు ముగిసిన శిక్షణ

కొవ్వూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంటు అథారిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు శిక్షణ అందజేశారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా 2024 ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వచ్చిన బుడమేరు వరదలను అధికార యంత్రాంగ ఎలా ఎదుర్కొందో వివరించారు. లైఫ్‌సైకిల్ అప్రోచ్‌లో గర్భిణులు, అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్ల వయసున్న వారు తీసుకోవలిసిన జాగ్రత్తలు తెలియజేశారు. వరదలు, తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అగ్నిమాపక అధికారులు నిర్వర్తించే విధులు, వినియోగించే పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు, ఈవోపీఆర్డీ బి.ప్రకాశరావు, కృష్ణవేణి, కేఆర్ కిషోర్, ఎ.గంగాధర్, టి.మణిరామ్, జి.మణికంటరాజు, వి.సతీష్, డి.జగదీశ్వరరావు, బి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నన్నయ సిబ్బందికి క్రీడాపోటీలు

దివాన్‌చెరువు, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ సిబ్బంది అంతా ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనాలని నన్నయ యూనివర్శిటీ వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి గురువారం వాలీబాల్, క్యారంబోర్డు పోటీలను వీసీ ప్రారంభించారు. ఆపై పురుష, మహిళా ఉద్యోగులకు నిర్వహించే క్రీడాపోటీలను తెలిపారు.



అచ్చిబాబును కలిసిన శ్రీరామ్

చాగల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏఎంసీ ౘైర్మన్‌గా నియమితులైన సందర్భంగా నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి(నాని)ని గురువారం పలువురు టీడీపీ నాయకులు, తెలుగు యువత నాయకులు ఆయనను కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. కేక్ కటింగ్ చేయించారు. అనంతరం శ్రీరామ్ దొమ్మేరు వెళ్లి టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్యను(అచ్చిబాబు) ఆయన నివాసంలో కలిశారు. ఏఎంసీ ౘైర్మన్‌గా నియమించినందుకు సహకరించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సహా పార్టీ పెద్దలకు కృతజ్ఞతులు తెలిపారు.

ఆయుష్మాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నల్లజర్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్‌వోలను తక్షణమే క్రమబద్ధీకరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర వైద్య ఉద్యోగుల సంఘం కార్యదర్శి జీవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లజర్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలన్నారు. జీతంతో పాటు కోతలు లేని ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కె.సాహిత్య, కె.సాయినాధ్, వాసవీ, మఫి, దీప్తి, జరీనా, కె.వెంకటలక్ష్మి, శ్రీలేఖ పాల్గొన్నారు.

కొవ్వూరు ఏబీఎన్ కళాశాలలో నేడు క్యాంపస్ డ్రైవ్

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొవ్వూరుని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రముఖ ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ లాబ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ 2024-25, బీఎస్సీ కెమిస్ట్రీ 2021 నుంచి 2025, బి-ఫార్మసీ 2024-25 సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 9-30 గంటలకు బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీవో వెంకటరమణ

తాళ్లపూడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేసే సబ్సిడీ రుణాల మంజూరుకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ, రవాణా రంగాలకు చెందిన అభ్యర్థులు ఫార్మసీ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల లోపు ఉండాలని, కుల ధ్రువీకరణపత్రం, తెల్ల రేషన్‌కార్డు ఉన్న వాళ్లు అర్హులని పేర్కొన్నారు. మే 10వ తారీఖు లోపు వోబీఎంఎంఎస్ వెబ్‌సైట్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గోవూరు సద్గురు శ్రీ త్యాగరాజ సామగాన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీ పెండ్యాల వెంకట్రాయుడు మెమోరియల్ ఫ్యాక్టరీ క్లబ్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. శ్రీ త్యాగరాజ సామగాన ఉత్సవ సమితి అధ్యక్షురాలు అనుపిండి జయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం త్యాగరాజ ఆరాధన, పంచరత్న గాన సేవ, అయ్యగారి సత్యప్రసాద్ వీణావాదన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.